వాస్తవాలు పలుకు DD9

TGTEL/26/A2635

వార్త

తెలుగు దినపత్రిక


హైదరాబాద్ | సంపుటి: 06 | సంచిక: 129 | 20-09-2026 | ఆదివారం | పేజీలు: 2

సుప్రీంకోర్టుకు దానం నాగేందర్

- హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ పిటిషన్
- అనర్హత వేటును సవాల్ చేస్తూ ఎస్ఎల్పీ
- ఇప్పటికే కేవియట్ దాఖలు చేసిన మహేశ్వర్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి
- దానం అనర్హతను సమర్థించిన తెలంగాణ హైకోర్టు
- ఎమ్మెల్యే పదవి ఖాళీ అవుతుందని హైకోర్టు స్పష్టీకరణ
- కొత్తగా ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుందని ఆదేశం
- దానం బీఆర్ఎస్ టికెట్‌పై ఖైరతాబాద్‌లో గెలుపు
- 2024 మార్చిలో కాంగ్రెస్‌లో చేరిన దానం




2



శ్రీరాముడిని "ఆదర్శంగా తీసుకోండి

- విద్యార్థులకు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ పిలుపు
- రాముడిధైర్యసాహసాలవల్లే విశ్వామిత్రుడు ఎంచుకున్నారనివెల్లడి
- భారత్‌లో విప్లవాత్మక మార్పులు జరుగుతున్నాయి
- అద్భుతమైన భవిష్యత్తు దిశగా భారత్ పయనం
- 2047 వరకు అమృత్ కాలమని వ్యాఖ్య
- 20 ఏళ్లలో భారత్ జీడీపీ 38

2



ఇది కాలం తెచ్చిన కరువు కాదు..

కాంగ్రెస్ తెచ్చిన కరువు

- శ్రీశైలం నుంచి 84 టీఎంసీలు వాడామన్నది పచ్చి అబద్ధం
- గత మూడేళ్లలో ఏపీ 718, తెలంగాణ కేవలం 216 టీఎంసీలే వాడిందన్న హరీశ్ రావు
- రాష్ట్ర చరిత్రలోనే ఈ ఏడాది అత్యల్పంగా కృష్ణా జలాల వినియోగం
- నీళ్లు, మోటార్లు ఉన్నా ప్రభుత్వం వాడుకోలేకపోయిందని విమర్శ

హైదరాబాద్, (డీడీ9 వార్త):

మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు ప్రకృతి వైపరీత్యం వల్ల వచ్చినవి కావని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ అసమర్థత వల్ల ఏర్పడిన కాంగ్రెస్ మార్క్ కరవు అని ఆయన ఆరోపించారు. కృష్ణా జలాలు వినియోగంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆయన ధ్వజమెత్తారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ, ఈ ఏడాది శ్రీశైలం నుంచి 84 టీఎంసీల నీటిని వినియోగించుకున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అసెంబ్లీలో పేర్కొనడం పచ్చి అబద్ధమని కొట్టిపారేశారు. వాస్తవానికి కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా ఇప్పటివరకు కేవలం 8 టీఎంసీల నీటిని మాత్రమే మళ్లించారని ఆయన స్పష్టం చేశారు. కల్వకుర్తి పథకంలోని ఐదు

మిగతా 2లో..

వరంగల్ ఎయిర్‌పోర్టుకు మంచి పేరు సూచించండి

- మామునూరు విమానాశ్రయం పనులు కీలక దశకు..
- డిసెంబరులో శంకుస్థాపనకు ఏర్పాట్లు
- వరంగల్ ఎయిర్‌పోర్టుకు పేరు సూచించాలని సీఎం విజ్ఞప్తి
- భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.295 కోట్లు కేటాయింపు
- అవసరమైన భూమిని ఏఏఐకి అప్పగించిన ప్రభుత్వం
- మొత్తం 953 ఎకరాల ప్రాంగణంలో విమానాశ్రయ నిర్మాణం
- నిర్మాణ పనులను మూడు ప్యాకేజీలుగా చేపట్టనున్న ఏఏఐ
- ప్రహరీ, రన్‌వే, పార్కింగ్, సీవరేజ్ పనులకు ప్రత్యేక ప్యాకేజీలు
- టెర్మినల్, ఏటీసీ టవర్, ఫైర్ స్టేషన్‌కు రూ.213.59 కోట్లు
- నవంబరు నాటికి టెండర్ ప్రక్రియ పూర్తి చేసేలా కార్యాచరణ



హైదరాబాద్, (డీడీ9 వార్త):

వరంగల్ మామునూరు విమానాశ్రయానికి పేరు సూచించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలను కోరారు. ప్రజా ప్రభుత్వం కృషితో వరంగల్ విమానాశ్రయం కల సాకారం కాబోతోందని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. విమానాశ్రయం కేవలం రవాణా సదుపాయం మాత్రమే కాదని.. పరిశ్రమలు, పర్యాటకం, విద్య, ఉద్యోగాలు, పెట్టుబడులకు కొత్త గేట్‌వేగా నిలుస్తుందని సీఎం తెలిపారు. వరంగల్ మామునూరు విమానాశ్రయం ఏర్పాటుకు చేపడుతున్న చర్యలు కీలక దశకు చేరుకున్నాయి. అనుమతులు, భూసేకరణ, సాంకేతిక పరిశీలన వంటి ప్రక్రియలు పూర్తికావడంతో నిర్మాణ పనులను మూడు ప్యాకేజీలుగా చేపట్టేందుకు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) చర్యలు చేపట్టింది. ఇప్పటికే రెండు ప్యాకేజీలకు సంబంధించి టెండర్ ప్రక్రియను పూర్తి చేసినట్లు అధికారులు వెల్లడించారు.

953 ఎకరాల చుట్టూ ప్రహరీ

విమానాశ్రయ నిర్మాణానికి కేటాయించిన సుమారు 953 ఎకరాల ప్రాంగణం చుట్టూ ప్రహరీ నిర్మాణాన్ని తొలి ప్యాకేజీలో చేపట్టనున్నారు. రెండో ప్యాకేజీలో రన్‌వే నిర్మాణంతో పాటు విమానాశ్రయ ఆవరణలో పార్కింగ్, సీవరేజ్ వ్యవస్థ వంటి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయనున్నారు.

రూ.213.59 కోట్లతో టెర్మినల్

మూడో ప్యాకేజీలో ప్రధాన

మిగతా 2లో..



స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో యువతకు కొత్త అవకాశాలు: మోదీ

- దేశీయ నైపుణ్యాలపై ప్రపంచవ్యాప్తంగా విశ్వాసం పెరిగింది
- 40 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై భారత్ సంతకాలు
- వ్యాపారులు, రైతులు, మహిళలకు కొత్త అవకాశాలు
- యువతే దేశీయ లక్ష్యాల సాధనకు కీలకం
- యువతకు సమగ్ర అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ఉద్దేశం
- 51 వేలకు పైగా అభ్యర్థులకు నియామక పత్రాలు
- రోజ్‌గార్ మేళాలో వర్చువల్‌గా పాల్గొన్న ప్రధాని
- టైర్-2, టైర్-3 నగరాల నుంచి దాదాపు సగం స్టార్టప్‌లు
- ప్రపంచంలో మూడో ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదిగింది
- దేశీయ నైపుణ్యాలకు అంతర్జాతీయంగా పెరుగుతున్న గుర్తింపు

హైదరాబాద్, (డీడీ9 వార్త):

భారత్ పలు దేశాలతో కుదుర్చుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు దేశీయ యువతకు కొత్త అవకాశాలను అందిస్తాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. దేశీయ నైపుణ్యాలపై ప్రపంచవ్యాప్తంగా విశ్వాసం పెరిగిందని పేర్కొన్నారు. వర్చువల్‌గా నిర్వహించిన రోజ్‌గార్ మేళాలో ప్రధాని పాల్గొని ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా కొత్తగా ఎంపికైన అభ్యర్థులకు 51 వేలకు పైగా నియామక పత్రాలను జారీ చేశారు.భారత్ ఇప్పటివరకు 40 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై సంతకాలు

మిగతా 2లో..

ఖైరతాబాద్ కాంగ్రెస్‌దే

- దానం నాగేందర్ విషయంలో కోర్టు తీర్పు బీఆర్ఎస్, కేసీఆర్‌కు చెంపపెట్టు
- పార్టీ ఫిరాయింపుల దుష్ట సంస్కృతిని కేసీఆరే తెచ్చారని ఆరోపణ
- తలసాని శ్రీనివాస్‌యాదవ్, సబితా ఇంద్రారెడ్డిని ఉదాహరణగా ప్రస్తావన
- గెలిచిన ఎమ్మెల్యేలను చేర్చుకుని మంత్రులను చేశారని వ్యాఖ్య
- ప్రభుత్వాలను పడగొట్టడం, పార్టీలను చీల్చడం భాజపా చరిత్ర అంటూ విమర్శ
- దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను భాజపా నాశనం చేస్తోందని ఆరోపణ
- దిల్లీలో మీడియాతో మాట్లాడిన టీపీసీసీ చీఫ్
- దానం వ్యవహారం నేపథ్యంలో తెలంగాణ రాజకీయాల్లో మరోసారి చర్చ



హైదరాబాద్, (డీడీ9 వార్త):

దానం నాగేందర్ విషయంలో కోర్టు ఇచ్చిన తీర్పు బీఆర్ఎస్, ఆ పార్టీ అధినేత కేసీఆర్‌కు చెంపపెట్టు లాంటిదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్

మిగతా 2లో..

సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఉద్రిక్తత

- సుధీర్‌రెడ్డి, మధుయాస్కీ వర్గాల పరస్పర నినాదాలు
- కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య తోపులాట
- పోలీసుల రంగప్రవేశంతో చెదరిపోయిన ఇరు వర్గాలు
- జీవో నం.118 ప్రకారం ఇళ్ల క్రమబద్ధీకరణ ధ్రువపత్రాల పంపిణీ
- కార్యక్రమానికి మంత్రులు పొంగులేటి, పాన్నం, అజహరుద్దీన్ హాజరు



హైదరాబాద్, (డీడీ9 వార్త):

సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఇళ్ల క్రమబద్ధీకరణ ధ్రువపత్రాల పంపిణీ కార్యక్రమంలో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. స్థానిక ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ నేత మధుయాస్కీ వర్గాలు పరస్పరం నినాదాలు చేసుకోవడంతో కొద్దిసేపు ఘర్షణ వాతావరణం నెలకొంది. ఇరు వర్గాల కార్యకర్తల మధ్య తోపులాట

మిగతా 2లో..



జన్వాడ ఫామ్‌హౌస్ నిర్మాణం అక్రమం

- నాలాపై నిర్మాణం చేపట్టారని ఎంపీ మల్లు రవి ఆరోపణ
- ఫామ్‌హౌస్‌కు అనుమతులు ఉన్నాయా? అని ప్రశ్న
- ఆస్తి ఎవరి పేరుపై ఉందో స్పష్టత లేదన్న ఎంపీ
- భూములను పరిశీలించేందుకు వెళ్లిన కాంగ్రెస్ బృందం
- అడ్డుకోబోయిన బీఆర్ఎస్ కార్యకర్తలు.. చెదరగొట్టిన పోలీసులు
- అక్రమాల నిగ్గు తేలుస్తామన్న చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్, (డీడీ9 వార్త):

రంగారెడ్డి జిల్లా జన్వాడలోని ఫామ్‌హౌస్ వ్యవహారం మరోసారి రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. ఫామ్‌హౌస్ నిర్మాణం, అక్కడి భూముల విషయంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల బృందం పలు ఆరోపణలు చేసింది. ఫామ్‌హౌస్‌ను నాలాపై నిర్మించారని, నిర్మాణానికి అవసరమైన అనుమతులు ఉన్నాయా అనే దానిపై స్పష్టత లేదని ఎంపీ మల్లు రవి ఆరోపించారు. ఫామ్‌హౌస్ ఎవరి పేరుపై ఉందో కూడా స్పష్టంగా తెలియడం లేదని ఆయన పేర్కొన్నారు. జన్వాడ ఫామ్‌హౌస్ వద్దకు కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల బృందం చేరుకుంది. అక్కడి భూములు, నిర్మాణాలను పరిశీలించడం తోపాటు.. భూములకు సంబంధించిన అంశాలను ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతో వచ్చినట్లు మల్లు రవి తెలిపారు. ఫామ్‌హౌస్ నిర్మాణం జరిగిన తీరుపై అధికారిక రికార్డులు, అనుమతులు, భూముల వివరాలను పరిశీలించాల్సిన అవసరం ఉందని

మిగతా 2లో..

- గజ్వేల్‌లో 388 ఎకరాలపై రెవెన్యూ సర్వే
- సర్వే నంబర్ 325లో అధికారుల పరిశీలన
- కేసీఆర్ ఫామ్‌హౌస్ సమీపంలో భూములు
- తమకూ హక్కులు ఉన్నాయంటున్న వెంకటాపూర్ వాసులు
- ఎర్రవల్లి వాటా 250 ఎకరాలేనని వాదన
- మిగిలిన భూమిపై తమకు హక్కులున్నాయని వెల్లడి
- కాస్రా, సిత్వార్ రికార్డులతో సర్వే చేయాలని డిమాండ్
- పాత రికార్డుల్లో తప్పిదాలు జరిగాయని ఆరోపణలు
- 215 మంది రైతులకు నోటీసులు ఇవ్వనున్న అధికారులు
- ఈ నెల 21 నుంచి నాలుగు విడతల్లో సర్వే

ఎర్రవల్లి భూముల సర్వేలో కొత్త వివాదం

గజ్వేల్, (డీడీ9 వార్త):

సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలోని ఎర్రవల్లిలో భూముల సర్వే వ్యవహారం మరో మలుపు తిరిగింది. కేసీఆర్ ఫామ్‌హౌస్ సమీపంలోని సర్వే నంబర్ 325లో ఉన్న 388 ఎకరాల భూమిని రెవెన్యూ అధికారులు సర్వే చేస్తున్నారు. ఈ భూముల్లో తమకూ హక్కులు ఉన్నాయంటూ శివారు వెంకటాపూర్ గ్రామస్థులు ఆందోళనకు దిగడంతో వివాదం తెరపైకి వచ్చింది.

388 ఎకరాల్లో తమకూ వాటా ఉందని వాదన

సర్వే నంబర్ 325లోని మొత్తం 388 ఎకరాల్లో ఎర్రవల్లి గ్రామస్థులకు సుమారు 250 ఎకరాలు మాత్రమే ఉన్నాయని వెంకటాపూర్ గ్రామస్థులు చెబుతున్నారు. మిగిలిన భూమిలో తమకు కూడా హక్కులు ఉన్నాయని పేర్కొంటున్నారు. భూముల హక్కులను పాత రికార్డుల ఆధారంగా

మిగతా 2లో..

శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకోండి

- **విద్యార్థులకు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ పిలుపు**
- **రాముడి ధైర్యసాహసాల వల్లే విశ్వామిత్రుడు ఎంచుకున్నారని వెల్లడి**
- **భారత్‌లో విప్లవాత్మక మార్పులు జరుగుతున్నాయి**
- **అద్భుతమైన భవిష్యత్తు దిశగా భారత్ పయనం**
- **2047 వరకు అమృత్ కాలమని వ్యాఖ్య**
- **20 ఏళ్లలో భారత్ జీడీపీ 38 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా**

హైదరాబాద్, (డీడీ9 వార్త):

శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ముందుకు సాగాలని జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ పిలుపునిచ్చారు. ఉత్తరాఖండ్‌లోని ఐఐటీ రూర్కీ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా శ్రీరాముడి ధైర్యసాహసాలను ప్రస్తావిస్తూ.. విశ్వామిత్రుడు రాక్షస సంహారం కోసం రాముడిని ఎంచుకోవడానికి ఆయనలోని ధైర్యమే కారణమని వివరించారు.

భారత్‌లో ప్రస్తుతం విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయని డోభాల్ అన్నారు. దేశం అద్భుతమైన భవిష్యత్తు దిశగా వేగంగా పయనిస్తోందని పేర్కొన్నారు. యువత తమ సామర్థ్యాలను గుర్తించి దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు.

భారత్ ఆర్థిక వ్యవస్థపై మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పేర్కొన్నట్లుగా 2047 వరకు దేశానికి అమృత్ కాలమని డోభాల్ అన్నారు. ప్రస్తుతం 4.015 ట్రిలియన్ డాలర్లుగా ఉన్న భారత జీడీపీ రానున్న 20 ఏళ్లలో 38 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని చెప్పారు.

తన ఉద్యోగ జీవితంలో ఎదురైన అనుభవాలను కూడా డోభాల్ విద్యార్థులతో పంచుకున్నారు. సిక్కింలో పనిచేస్తున్న సమయంలో మౌంటైన్ గైడ్‌గా పనిచేసే వ్యక్తి నుంచి మూడు విజయ సూత్రాలను నేర్చుకున్నట్లు తెలిపారు.

మొదటిది.. మనం ప్రస్తుతం ఏ స్థితిలో ఉన్నామో తెలుసుకోవడం అని డోభాల్ చెప్పారు. రెండోది.. ఎక్కడికి వెళ్లాలో స్పష్టంగా తెలుసుకోవడం, అంటే కచ్చితమైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం అన్నారు. మూడోది.. లక్ష్యాన్ని చేరుకున్న తర్వాత అక్కడి నుంచి తిరిగి ఎలా రావాలో కూడా తెలుసుకోవడం అని వివరించారు.ఈ మూడు సూత్రాలను జీవితంలో పాటిస్తే విజయానికి చక్కటి మార్గం ఏర్పడుతుందని అజిత్ డోభాల్ విద్యార్థులకు సూచించారు.

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో యువతకు కొత్త అవకాశాలు

మొదటిపేజీ తరువాయి

చేసిందని మోదీ తెలిపారు. ఈ ఒప్పందాల ద్వారా వ్యాపారులు, రైతులు, మహిళలు సహా వివిధ వర్గాలకు కొత్త అవకాశాలు లభిస్తాయని చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానం పెరగడం ద్వారా దేశీయ ప్రతిభకు మరిన్ని అవకాశాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.

దేశీయ యువతే భారత అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో కీలకమని ప్రధాని అన్నారు. యువతకు సమగ్ర అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఉద్యోగాలు, నైపుణ్యాభివృద్ధి, వ్యాపార అవకాశాల ద్వారా యువతకు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు.

స్టార్టప్‌లపై మాట్లాడుతూ.. గుర్తింపు పొందిన స్టార్టప్‌లలో దాదాపు సగం వరకు టైర్2, టైర్3 నగరాల నుంచే పుట్టుకొస్తున్నాయని మోదీ తెలిపారు. చిన్న నగరాలు, పట్టణాల్లోనూ యువతలో పారిశ్రామిక ఆలోచనలు వేగంగా పెరుగుతున్నాయని పేర్కొన్నారు.

ప్రపంచంలో మూడో ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదిగిందని ప్రధాని అన్నారు. దేశ ఆర్థిక ప్రగతిలో యువత పాత్ర కీలకమని, వారి నైపుణ్యాలను సరైన అవకాశాలతో అనుసంధానించడం ద్వారా భారత్ మరింత వేగంగా అభివృద్ధి చెందగలదని మోదీ పేర్కొన్నారు.

ఇది కాలం తెచ్చిన కరువు కాదు..

కాంగ్రెస్ తెచ్చిన కరువు

మొదటిపేజీ తరువాయి

మోటార్లలోకేవలం రెండే పని చేస్తుండటం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.

గత మూడేళ్లలో కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) గణాంకాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ 718 టీఎంసీల నీటిని వినియోగించుకోగా, తెలంగాణ కేవలం 216 టీఎంసీలకే పరిమితమైందని ఆయన వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 202425 ఆర్థిక సంవత్సరంలోనే అత్యంత తక్కువ స్థాయిలో కృష్ణా జలాలను వినియోగించుకోవడం అత్యంత విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

"నీళ్లు అందుబాటులో ఉన్నాయి, ఎత్తిపోసేందుకు మోటార్లు సిద్ధంగా ఉన్నాయి. అయినప్పటికీ నీటిని మళ్లించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉంది. అందుకే ఇది కాలం తెచ్చిన కరవు కాదు, కాంగ్రెస్ తెచ్చిన కరవు" అని ఆయన ఎద్దేవా చేశారు. ఏపీ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు, వెలిగొండ ప్రాజెక్టుల ద్వారా అక్రమంగా నీటిని తరలించుకుపోతున్నా, తెలంగాణ ప్రభుత్వం మౌనంగా ఉండటం దారుణమని దుయ్యబట్టారు.

జన్వాడ ఫామ్‌హౌస్ నిర్మాణం అక్రమం

మొదటిపేజీ తరువాయి

ఆయన అన్నారు.

బస్సును అడ్డుకునే యత్నం

కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల బృందం బస్సులో జన్వాడకు చేరుకున్న సమయంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. బస్సును అడ్డుకునేందుకు బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రయత్నించారు. దీంతో పోలీసులు వారిని పక్కకు నెట్టివేశారు. బస్సు ముందు వరుసలో ఎంపీ అనిల్ యాదవ్,ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఉన్నారు. అనంతరం కాంగ్రెస్ నేతలు ఫామ్‌హౌస్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు.

ఇన్ని ఎకరాల్లో ఎలా నిర్మించారు?


జన్వాడలో ఫామ్‌హౌస్ నిర్మాణం జరిగిన తీరుపై ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నలు సంధించారు. ఇన్ని ఎకరాల్లో ఫామ్‌హౌస్‌ను ఎలా నిర్మించారని ఆయన ప్రశ్నించారు. నిర్మాణాలు, భూముల విషయంలో నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే పూర్తి వివరాలను వెలుగులోకి తీసుకొస్తామని అన్నారు. ఇక్కడ ఏవైనా అక్రమాలు జరిగి ఉంటే వాటిని నిగ్గు తేలుస్తామని స్పష్టం చేశారు.

111 జీవో పరిధిలో భూముల ప్రస్తావన

జన్వాడ పరిసరాల్లోని భూములపై కాంగ్రెస్ నేతలు 111 జీవో అంశాన్ని ప్రస్తావించారు. ఈ భూములన్నీ సత్యం రామలింగరాజుకు చెందినవని వారు పేర్కొన్నారు. 111 జీవో కింద ఆయన ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. భూముల యాజమాన్య హక్కులు, వాటి బదలాయింపులు, నిర్మాణాలకు సంబంధించిన అనుమతులపై పూర్తిస్థాయిలో పరిశీలన అవసరమని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు.

హైడ్రాతో మాట్లాడతాం

జన్వాడలో భూములకు సంబంధించిన అక్రమాలు ఏమైనా ఉన్నాయా అనే అంశంపై హైడ్రాతో మాట్లాడతామని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు తెలిపారు. భూముల రికార్డులు, నిర్మాణ అనుమతులు, నాలా పరిస్థితి తదితర అంశాలను పరిశీలించిన తర్వాత తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. జన్వాడ ఫామ్‌హౌస్‌కు సంబంధించిన వ్యవహారంలో వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావడమే తమ ఉద్దేశమని కాంగ్రెస్ నేతలు వెల్లడించారు.



వరంగల్ ఎయిర్‌పోర్టుకు మంచి పేరు సూచించండి

మొదటిపేజీ తరువాయి

విమానాశ్రయ భవనాల నిర్మాణం చేపట్టనున్నారు. టెర్మినల్ భవనం, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ) టవర్, ఫైర్ స్టేషన్, విద్యుత్తు సబ్‌స్టేషన్ తదితర పనులను రూ.213.59 కోట్లతో చేపట్టేందుకు ప్రతిపాదించారు. ఈ పనులకు తాజాగా టెండర్లు పిలిచినట్లు సమాచారం. నవంబరు నాటికి ప్రక్రియను పూర్తి చేసి పనులను ముందుకు తీసుకెళ్లేలా కార్యాచరణ రూపొందించినట్లు ఏఏఐ వర్గాలు తెలిపాయి.

డిసెంబరులో శంకుస్థాపన?

విమానాశ్రయ నిర్మాణ పనులకు డిసెంబరులో శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు ఏఏఐ వర్గాల ద్వారా తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ కోసం రూ.295 కోట్లు కేటాయించడంతో పాటు అవసరమైన భూమిని సేకరించి ఏఏఐకి అప్పగించింది. దీంతో మామునూరు విమానాశ్రయ నిర్మాణానికి క్షేత్ర స్థాయిలో మార్గం సుగమమైంది.

అభివృద్ధికి కొత్త గేట్‌వే

మామునూరు విమానాశ్రయం అందుబాటులోకి వస్తే వరంగల్ ప్రాంతంలో పారిశ్రామిక, పర్యాటక, విద్యా రంగాలకు ఊతం లభించే అవకాశం ఉంది. పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనకు కూడా ఇది దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అభివృద్ధి చెందుతున్న, అనుసంధానమైన తెలంగాణకు మామునూరు విమానాశ్రయం కొత్త చిహ్నంగా నిలుస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. విమానాశ్రయం నుంచి ప్రయాణించేందుకు తాను ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు తెలిపారు.

పేరు కోసం ప్రజల అభిప్రాయాలు

ఇదిలా ఉండగా.. వరంగల్ విమానాశ్రయానికి తగిన పేరు సూచించాలని సీఎం ప్రజలకు పిలుపునివ్వడం ఆసక్తికరంగా మారింది. చారిత్రక వరంగల్ నేపథ్యాన్ని ప్రతిబింబించే పేరుతో పాటు ప్రాంతీయంగా ప్రాధాన్యం ఉన్న వ్యక్తులు, అంశాల పేర్లపై ప్రజల నుంచి సూచనలు వచ్చే అవకాశం ఉంది.



ఖైరతాబాద్ కాంగ్రెస్‌దే

మొదటిపేజీ తరువాయి

అన్నారు. దిల్లీ పర్యటనలో ఉన్న ఆయన మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. కోర్టు తీర్పును స్వాగతిస్తున్నట్లు తెలిపారు. దానం నాగేందర్ వ్యవహారంలో కోర్టు తీర్పు బీఆర్ఎస్, కేసీఆర్‌కు గట్టి ఎదురుదెబ్బగా మహేశ్‌కుమార్ గౌడ్ అభివర్ణించారు. కోర్టు తీర్పును కాంగ్రెస్ స్వాగతిస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా పార్టీ ఫిరాయింపుల అంశంపై బీఆర్ఎస్, భాజపాలపై ఆయన విమర్శలు చేశారు.

ఫిరాయింపుల సంస్కృతి కేసీఆర్‌దే

పార్టీ ఫిరాయింపుల దుష్ట సంస్కృతిని కేసీఆరే తీసుకొచ్చారని మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. గతంలో తెదేపా తరఫున గెలిచిన తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను, కాంగ్రెస్ తరఫున గెలిచిన సబితా ఇంద్రారెడ్డిని బీఆర్ఎస్‌లో చేర్చుకుని మంత్రులను చేశారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలకు అర్థం లేదన్నట్లుగా ఆయన వ్యాఖ్యానించారు.

బీజేపీపైనా విమర్శలు

ప్రభుత్వాలను పడగొట్టడం, పార్టీలను చీల్చడం భాజపా చరిత్ర అని టీపీసీసీ చీఫ్ ఆరోపించారు. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను భాజపా నాశనం చేస్తోందని విమర్శించారు. పార్టీ ఫిరాయింపుల అంశంపై కాంగ్రెస్ వైఖరిని సమర్థించుకుంటూ బీఆర్ఎస్, భాజపాలపై ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

ఖైరతాబాద్‌పై ధీమా

ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం కాంగ్రెస్‌దేనని మహేశ్‌కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. దానం నాగేందర్ వ్యవహారం నేపథ్యంలో ఖైరతాబాద్ నియోజకవర్గంపై రాజకీయంగా ఆసక్తి నెలకొన్న వేళ.. కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ఆయన పేర్కొన్నారు.

ఎర్రవల్లి భూముల సర్వేలో కొత్త వివాదం

మొదటిపేజీ తరువాయి

తేల్చాలని అధికారులను కోరుతున్నారు.

కాస్రా, సిత్వార్ రికార్డుల ఆధారంగా సర్వే

ప్రస్తుతం ఉన్న రికార్డుల ఆధారంగానే కాకుండా పాత కాస్రా, సిత్వార్ రికార్డులను పరిశీలించి సర్వే నిర్వహించాలని వెంకటాపూర్ వాసులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది చేసిన తప్పిదాల కారణంగానే భూ రికార్డుల్లో మార్పులు చోటుచేసుకున్నాయని వారు ఆరోపిస్తున్నారు. పాత రికార్డులను పరిశీలిస్తే వాస్తవ హక్కులు స్పష్టమవుతాయని చెబుతున్నారు.

రైతులకు నోటీసుల జారీ

ఇదిలా ఉండగా.. సర్వే నంబర్ 325లో వ్యవసాయం చేసుకుంటున్న రైతులకు రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. విడతల వారీగా నోటీసుల ప్రక్రియ కొనసాగుతోంది. మొత్తం 215 మంది రైతులకు నోటీసులు ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా తాజాగా 50 మంది రైతులకు నోటీసులు జారీ చేశారు.

21 నుంచి నాలుగు విడతల్లో సర్వే

సర్వే నంబర్ 325లో ఈ నెల 21వ తేదీ నుంచి నాలుగు విడతల్లో సర్వే నిర్వహించనున్నారు. నిర్ణయించిన తేదీల్లో రైతులు తమ భూముల వద్దకు హాజరై సంబంధిత వివరాలను అధికారులకు తెలియజేయాలని నోటీసుల్లో పేర్కొన్నారు. భూములకు సంబంధించిన పత్రాలు, వివరాలను అందుబాటులో ఉంచాలని అధికారులు సూచించినట్లు తెలుస్తోంది.

హక్కులకు భంగం కలగకుండా చూడాలని విజ్ఞప్తి

ప్రస్తుత సర్వేలో తమ హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా చూడాలని వెంకటాపూర్ గ్రామస్థులు అధికారులను కోరుతున్నారు. పాత రికార్డులు, భూముల అనుభవం, ప్రస్తుతం ఉన్న రెవెన్యూ వివరాలను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే హక్కులను నిర్ధారించాలని డిమాండ్ చేస్తున్నారు.

సర్వే నంబర్ 325లోని 388 ఎకరాల భూమికి సంబంధించి ఎర్రవల్లి, వెంకటాపూర్ గ్రామస్థుల వాదనలు భిన్నంగా ఉండటంతో.. రెవెన్యూ అధికారులు చేపడుతున్న సర్వే, పాత రికార్డుల పరిశీలనపై ఆసక్తి నెలకొంది. నాలుగు విడతల్లో జరగనున్న సర్వే పూర్తయిన తర్వాత భూముల హక్కులకు సంబంధించి మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఉద్రిక్తత

మొదటిపేజీ తరువాయి

జరగడంతో పోలీసులు రంగంలోకి దిగి వారిని చెదరగొట్టారు.

జీవో నం.118 ప్రకారం ఇళ్ల క్రమబద్ధీకరణ ధ్రువపత్రాల జారీ కోసం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో కార్యక్రమం నిర్వహించారు. ధ్రువపత్రాలు అందుకునేందుకు పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ నేత మధుయాస్కి వర్గాలకు చెందిన కార్యకర్తల మధ్య నినాదాల పోటీ మొదలైంది. క్రమంగా పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఇరు వర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. అప్రమత్తమైన పోలీసులు ఇరు వర్గాలను విడదీసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ధ్రువపత్రాల పంపిణీ కార్యక్రమానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్ హాజరయ్యారు. మంత్రుల సమక్షంలోనే ఇరు వర్గాల మధ్య నినాదాలు, తోపులాట జరగడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకోవడంతో కార్యక్రమం కొనసాగింది.



సుప్రీంకోర్టుకు దానం నాగేందర్

- **హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ పిటిషన్**
- **అనర్హత వేటును సవాల్ చేస్తూ ఎస్ఎల్‌పీ**
- **ఇప్పటికే కేవియట్ దాఖలు చేసిన మహేశ్వర్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి**
- **దానం అనర్హతను సమర్థించిన తెలంగాణ హైకోర్టు**
- **ఎమ్మెల్యే పదవి ఖాళీ అవుతుందని హైకోర్టు స్పష్టీకరణ**
- **కొత్తగా ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుందని ఆదేశం**
- **దానం బీఆర్ఎస్ టికెట్‌పై ఖైరతాబాద్‌లో గెలుపు**
- **2024 మార్చిలో కాంగ్రెస్‌లో చేరిన దానం**

హైదరాబాద్, (డీడీ9 వార్త):

ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హతపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. శనివారం మధ్యాహ్నం దానం తరఫున సుప్రీంకోర్టులో ప్రత్యేక అనుమతి పిటిషన్ (ఎస్ఎల్‌పీ) దాఖలైనట్లు సమాచారం. హైకోర్టు తీర్పుపై తదుపరి న్యాయపోరాటానికి దానం సిద్ధమయ్యారు. ఇదే వ్యవహారంలో బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇప్పటికే సుప్రీంకోర్టులో కేవియట్‌లు దాఖలు చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో దానం నాగేందర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఖైరతాబాద్ నుంచి గెలిచారు. అనంతరం 2024 మార్చిలో కాంగ్రెస్‌లో చేరారు. అదే ఏడాది సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఎమ్మెల్యేగా కొనసాగుతూనే పార్టీ మారడాన్ని సవాలు చేస్తూ భాజపా ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అనర్హత పిటిషన్లు దాఖలు చేశారు.

పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో అనర్హత పిటిషన్లపై స్పీకర్ నిర్ణయం తీసుకోవడంలో జాప్యం జరుగుతోందంటూ ఈ వ్యవహారం హైకోర్టుకు చేరింది. 2024 సెప్టెంబరులో అసెంబ్లీ కార్యదర్శి అనర్హత పిటిషన్లను స్పీకర్ ముందుంచి, నిర్ణయానికి సంబంధించిన షెడ్యూల్ రూపొందించాలని హైకోర్టు ఆదేశించింది. అనంతరం ఈ అంశం సుప్రీంకోర్టు వరకు వెళ్లింది.

స్పీకర్ నిర్ణయంపై హైకోర్టు జోక్యం

దానం నాగేందర్‌తో పాటు కాంగ్రెస్‌లో చేరిన ఇతర ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు కూడా స్పీకర్‌కు గడువు విధించింది. ఆ తర్వాత దానం వ్యవహారంలో స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ మహేశ్వర్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు శుక్రవారం దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేసింది. స్పీకర్ దానం అనర్హత పిటిషన్‌ను తిరస్కరిస్తూ ఇచ్చిన నిర్ణయాన్ని పక్కనపెట్టింది. దానం ఎమ్మెల్యే పదవి ఖాళీ అయినట్లుగా పరిగణించాలని, ఖైరతాబాద్ స్థానానికి తాజాగా ఎన్నిక నిర్వహించాల్సి ఉంటుందని పేర్కొంది.

సుప్రీంకోర్టులో తదుపరి పోరాటం

హైకోర్టు తీర్పుతో ఎమ్మెల్యే పదవిపై ప్రతికూల ప్రభావం పడటంతో దానం నాగేందర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తీర్పును సవాలు చేస్తూ ఎస్ఎల్‌పీ దాఖలు చేశారు. ఇదే సమయంలో మహేశ్వర్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి కేవియట్‌లు దాఖలు చేయడంతో దానం పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టినప్పుడు తమ వాదనలు కూడా వినాలని వారు కోరినట్లయింది.





బిట్స్ లో మెరిసిన ఆణిముత్యం

- **రాజేశ్వరరావుపల్లి విద్యార్థి తవిటి సిద్ధుకు గోల్డ్ మెడల్**

రాజేశ్వరరావుపల్లి, సెప్టెంబర్ 19, డి డి 9 వార్త :

గ్రామానికి చెందిన *తవిటి దిలిప్ కుమార్ తేజశ్రీ ముదిరాజ్ కుమారుడు సిద్ధు , *బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్ (BITS)*లో ఫస్ట్ క్లాస్ A సెక్షన్లో విద్యాభ్యాసం చేస్తున్నాడు.

ఈరోజు పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యలో ప్రతిభ కనబరిచిన సిద్ధుకు గోల్డ్ మెడల్‌తో పాటు "సూపర్ లెర్నర్" ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మరియు ఉపాధ్యాయులు సిద్ధును అభినందించారు. చిన్న వయసులోనే చదువుపై ఆసక్తి కనబరిచి పాఠశాలలో గుర్తింపు పొందడం పట్ల సిద్ధు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. సిద్ధు ఇదే ఉత్సాహంతో విద్యలో మరింత ముందుకు సాగి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని తల్లిదండ్రులు ఆకాంక్షించారు.ఈ సందర్భంగా సిద్ధును అభినందించిన పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు- తవిటి దిలిప్ కుమార్ ముదిరాజ్
తెలంగాణ రాజ్యాధికార పార్టీ(TRP)
ములుగు జిల్లా అధ్యక్షులు





మారుమూల ప్రాంతాల విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

- **సుమారు 350 మంది విద్యార్థులకు బ్యాగులు, నోటుబుక్కులు, పలకలు అందజేత**

వాజేడు, సెప్టెంబర్ 19 (డిడి9 వార్త):

ములుగు జిల్లా వాజేడు మండలంలోని మారుమూల ప్రాంతాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఏడుచర్లపల్లి సర్పంచ్ అట్టం మమత చేతుల మీదుగా ఏడుచర్లపల్లి, కొత్తూరు, ముత్తారం, పూసూరు, జగన్నాధపురం, మోట్లగూడెం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 350 మంది విద్యార్థులకు బ్యాగులు, నోటుబుక్కులు, పలకలను అందజేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కందుల రామ్ కిషోర్ మాట్లాడుతూ.. మారుమూల పల్లె ప్రాంతాల్లోని పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న గ్రేస్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకులు బిషప్ మారినేని జాకబ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించడం ద్వారా వారి చదువుకు ప్రోత్సాహం కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. పేద విద్యార్థులకు అండగా నిలిచే ఇటువంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మురళీకృష్ణ రెడ్డి, కల ప్రసాద్, ముర్రం రాజేష్, కంతి ముత్తయ్య, లక్ష్మణరావు, ఆదిశివతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

పదవి కోసం కాదు పార్టీ కోసం బతికే మనిషి పైడకుల అశోక్ అన్న.

- **ములుగులో కాంగ్రెస్ అంటేనే అశోక్ అన్న అంటేనే కాంగ్రెస్!**

తాడ్వాయి డిడి9 వార్త


నిఖార్సయిన కాంగ్రెస్ వాది పుట్టినరోజు. ములుగు DCC అధ్యక్షుడు పైడకుల అశోక్ కి HBN CEO హబీబ్ ఖాన్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

అశోక్ అన్న కథ సాధారణ నాయకుడి కథ కాదు. ఇది ఒక వారసత్వపు కథ. చల్వాయి గడ్డపై తండ్రి కృష్ణమూర్తి గారి నుంచి అందుకున్న కాంగ్రెస్ జెండాను.. NSUI నినాదాల నుంచి నేటి DCC అధ్యక్ష పదవి వరకు దించకుండా మోసిన పోరాట కథ. కాంగ్రెస్ 10 ఏళ్లు అధికారంలో లేనప్పుడు చాలామంది జెండా వదిలి పారిపోయారు. కానీ ఈ ఒక్కడు మాత్రం పార్టీ కష్టంలో ఉందని మరింత గట్టిగా జెండా పట్టుకున్నాడు. అదే కాంగ్రెస్ తత్వం అంటే.

కరోనా అనే మహమ్మారి ఊర్లను వణికిస్తుంటే సీతక్కతో కలిసి ప్రాణాలకు తెగించి పేదల ఇంటి తలుపు తట్టిన ధైర్యం అశోక్ అన్నది అది రాహుల్ గాంధీ చెప్పిన భారత్ జోడో స్ఫూర్తి. ఇందిరమ్మ చూపిన సేవా మార్గం.ఆదివాసీ బిడ్డ ఏడ్చినా, దళిత కార్యకర్తకు కష్టం వచ్చినా, మైనారిటీ సోదరుడికి అండ కావాలన్నా గుర్తొచ్చే ఒకే ఒక్క పేరు అశోక్ అన్న. అందుకే హైకమాండ్ అతనికి రెండోసారి DCC బాధ్యతలు ఇచ్చింది.

జిల్లాను ఇంత బలోపేతం చేసిన మనిషికి ఇక రాష్ట్రస్థాయి గుర్తింపు దక్కాలి. TGMDC చైర్మన్ లాంటి కీలక పదవి అశోక్ అన్నకు వస్తే అది ములుగు కార్యకర్తలందరికీ దక్కిన గౌరవం ములుగు కాంగ్రెస్ కుటుంబం తరపున అశోక్ అన్నకు జన్మదిన శుభాకాంక్షలు.

ములుగు DCC అధ్యక్షుడు పైడకుల అశోక్ కి జన్మదిన శుభాకాంక్షలు. HBN CEO హబీబ్ ఖాన్ శుభాకాంక్షలు తెలిపారు. తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన కాంగ్రెస్ భావజాలంతో NSUI నుంచి DCC వరకు ఎదిగిన నాయకుడు. కరోనా సమయంలో సీతక్కతో కలిసి ప్రజలకు అండగా నిలిచిన నేత. కార్యకర్తలకు అన్నగా, పేదలకు భరోసాగా నిలుస్తున్న అశోక్ అన్నకు రాష్ట్ర స్థాయిలో, TGMDC చైర్మన్ గా అవకాశం రావాలని HBN ఛానెల్ మరియు కాంగ్రెస్ కార్యకర్తల ఆకాంక్ష. అని HBN CEO హబీబ్ ఖాన్ తెలిపారు.



శ్రీశ్రీశ్రీ విజయ విఘ్నేశ్వర స్వామి వారి ప్రత్యేక పూజ మరియు అన్నప్రసాద వితరణ కార్యక్రమలలో పాల్గొన్న... ప్రజాప్రతినిధులు..

మణుగూరు. సెప్టెంబర్ 19(డి డి 9వార్త)

మణుగూరు మండలం,సమితి సింగారం గ్రామపంచాయతీ పరిధి లోని వాసవి నగర్ లో ఏర్పాటు చేసిన శ్రీశ్రీశ్రీ విజయ విఘ్నేశ్వర స్వామి వారి మండపంలో శనివారం నాడు నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమాలలో సమితిసింగారం గ్రామపంచాయతీ కి చెందిన ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు స్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.అనంతరం కమిటీ వారు నిర్వహించిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, లోక క్షేమం కోసం విఘ్నేశ్వరుని ప్రతిష్టించి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించడంతో పాటు అన్నప్రసాద వితరణ చేపట్టడం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులను వారు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి & మాజీ సర్పంచ్ దొబ్బల వెంకటప్పయ్య, సమితి సింగారం గ్రామపంచాయతీ సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు భాగం రవి, ఎండి యాకూబ్ అలీ, గుండ్ల వెంకటేశ్వర్లు, తాతా ప్రసాద్, బొజ్జా త్రిమూర్తులు, పొగాకు వెంకటేశ్వర్లు ,అబ్దుల్లా, వాసవి నగర్ కమిటీ సభ్యులు కత్తి రాము, రమేష్, నరేంద్ర, కే వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.





భద్రాచలంలో వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

- **భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శాఖల సమన్వయంతో పనిచేయాలి**
- **ఘాట్ల వద్ద లాంచీలు.. బారికేడింగ్.. గజ ఈతగాళ్లు అప్రమత్తంగా ఉండాలి..**
- **నిమజ్జన ఘాట్ల వద్ద భద్రతా చర్యలు పటిష్ఠం చేయాలి: కలెక్టర్ అంకిత్**

భద్రాచలం, సెప్టెంబరు 19 (డిడి9 వార్త)

భద్రాచలంలో ఈ నెల 24, 25, 26 తేదీల్లో జరగనున్న వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతంగా, ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శనివారం భద్రాచలం గోదావరి నదీ తీరంలోని నిమజ్జన ఘాట్లను భద్రాచలం సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ్, డీఎస్పీ అరుణ్‌కుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు.

నిమజ్జనానికి అవసరమైన లాంచీలు, బారికేడింగ్, లైటింగ్, సీసీ కెమెరాల ఏర్పాటు, తాగునీటి వసతి, వైద్య బృందాలు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. నదీ తీరంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ఠ రక్షణ చర్యలు చేపట్టాలని సబ్‌కలెక్టర్, డీఎస్పీని ఆదేశించారు.

నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా పోలీస్, రెవెన్యూ, రవాణా, వైద్యారోగ్య, అగ్నిమాపక, అటవీ, ఇరిగేషన్, దేవాదాయ, పంచాయతీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఆయా శాఖల అధికారులు, సిబ్బంది నిరంతరం పరిస్థితులను పర్యవేక్షిస్తూ అవసరమైన సమాచారాన్ని ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు అందించాలని ఆదేశించారు.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భద్రాచలానికి వచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని తెలిపారు. నిర్దేశించిన ప్రాంతాల్లోనే విగ్రహాల నిమజ్జనం నిర్వహించాలని, వాహనాలను కేటాయించిన పార్కింగ్ ప్రదేశాల్లోనే నిలిపివేయాలని సూచించారు. చిన్నారులు, మహిళలు, వృద్ధులు నదీ ఘాట్ల వద్ద అప్రమత్తంగా ఉండాలని భక్తులకు సూచించారు. మద్యం సేవించి నిమజ్జన కార్యక్రమాలకు రావద్దని, విగ్రహాల నిమజ్జనం క్రమపద్ధతిలో నిర్వహించాలని స్పష్టం చేశారు.

క్రమశిక్షణతో శోభాయాత్రలు

గణేశ్ మండపాల నిర్వాహకులు, భక్తులు విగ్రహాల శోభాయాత్రలను క్రమశిక్షణతో నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. పెద్ద సంఖ్యలో గుంపులు ఏర్పడకుండా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో ఊరేగింపులు నిర్వహించాలన్నారు. అధిక శబ్దంతో డీజేలు, మ్యూజిక్ వినియోగించవద్దని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీస్, మున్సిపల్ అధికారుల సూచనల మేరకు ఊరేగింపులు కొనసాగించాలని తెలిపారు.

ఆలయ పనులు నాణ్యతతో పూర్తి చేయాలి

అనంతరం భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో జరుగుతున్న అభివృద్ధి, పునర్నిర్మాణ పనులను కలెక్టర్ అంకిత్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఉత్తర ద్వార దర్శనం, చిత్రకూట మండపం పరిసరాలు, గోశాల, అన్నదాన సత్రం, విస్తా కాంప్లెక్స్, శివాలయానికి వెళ్లే మార్గం, రామాలయం, మాడవీధులు, పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు.

పనుల పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. నిర్మాణాల్లో ఎలాంటి నాణ్యతా లోపాలు లేకుండా, దీర్ఘకాలం మన్నికగా ఉండేలా పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. గోదావరి పుష్కరాల ప్రారంభానికి ముందే గోదావరి పరివాహక ప్రాంతంలోని ఘాట్ల నిర్మాణ, అభివృద్ధి పనులను పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో భద్రాచలం సర్పంచ్ పూనం కృష్ణ, డీఎస్పీ అరుణ్‌కుమార్, పంచాయతీ ఈఓ శ్రీనివాస్‌రావు, దేవస్థానం ఈఓ దామోదర్‌రావు, ఎంవీఐ సంఘం వెంకట పుల్లయ్య, ఇరిగేషన్ ఏఈఈలు రవితేజ, గణేష్, ఐటీసీ ప్రతినిధులు చెంగల్‌రావు, దుర్గాప్రసాద్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





పైడాకుల అశోక్ అన్న జన్మదిన వేడుకలు

- **తాడ్వాయి మండల కేంద్రంలో ఘనంగా ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ అన్న జన్మదిన వేడుకలు**
- **నమ్ముకున్న సిద్ధాంతం కోసం నిలబడే నిబద్ధత గల నాయకుడు మన అశోక్ అన్న**
- **కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన తాడ్వాయి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంకిడి నరసింహ స్వామి**

తాడ్వాయి డిడి9 వార్త

తాడ్వాయి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల అధ్యక్షులు మంకిడి నరసింహ స్వామి మాజీ అధ్యక్షులు బొల్లు దేవేందర్ ముదిరాజ్ హాజరై కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు

గ్రామస్థాయి కాంగ్రెస్ కార్యకర్తగా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎదిగిన పైడాకుల అశోక్ పార్టీ బలోపేతానికి, కార్యకర్తల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నారని నాయకులు అన్నారు. మంత్రి సీతక్క నాయకత్వంలో పార్టీ కోసం అహర్నిశలు పనిచేస్తూ, యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని కొనియాడారు ఈ సందర్భంగా పైడాకుల అశోక్ కి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో నిండిన దీర్ఘాయుష్షు కలగాలని తాడ్వాయి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆకాంక్షించారు

ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జాలపు అనంత రెడ్డి , మండల ఉపాధ్యక్షులు ఇప్ప నాగేశ్వర రావు , సహకార సంఘం మాజీ చైర్మన్ పాక సాంబయ్య , బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఎండీ ముజఫర్ , సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు గడ్డం నాగ భూషణం , సర్పంచులు తోలెం కృష్ణ , ముక్తి శ్రీనివాస్ , ఇర్ప వెంకటేశ్వర్లు , పీరీల భారతి వెంకన్న , మంకిడి శ్రీలత ప్రశాంత్ , సూరకంటి సమ్మక్క గోవర్ధన్ , మాజీ ఎంపీటీసీ బత్తిని రాజు గౌడ్ ఉపసర్పంచులు కట్కూరి భాస్కర్ రెడ్డి , ఆలకుంట వనిత కృష్ణ , మండల సీనియర్ నాయకులు ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు పురుషోత్తం నారాయణ , కిసాన్ సెల్ మండల అధ్యక్షులు భూషబోయిన రవి కుమార్ , ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు మంకిడి ప్రశాంత్ , మండల సీనియర్ నాయకులు తాండాల శ్రీను , చింత రంగయ్య , ఆలయ డైరెక్టర్ పల్నాటి సత్యం , ఆత్మ కమిటీ డైరెక్టర్ మర్రి నరేష్ , ముక్తి రామస్వామి , సీతక్క యువసేన జిల్లా అధ్యక్షులు చర్ప రవీందర్ , మొక్క దుర్గయ్య , రాపోలు సంజీవ రెడ్డి , దాయ వెంకన్న , అశ్వినీ సూర్య నారాయణ , జవ్వాజి మోహన్ రావు , గ్రామ కమిటీ అధ్యక్షులు పాక రాజేందర్ , మహిళా నాయకురాలు ముండ్రాతి రాజశ్రీ , యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ శనిగరపు చిరంజీవి , మంకిడి సమ్మయ్య , మంకిడి నర్సయ్య , ఆలేటి జైపాల్ రెడ్డి , అనుమాండ్ల రాజీ రెడ్డి , గంట సాయి రెడ్డి , మడకం శోభన్ , బొమ్మగాని గణేష్ , సాదు చక్రపాణి , కరెంగుల రాంబాబు , నూనావత్ శ్రీను , మేడారం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బత్తిని తరుణ్ , ప్రధాన కార్యదర్శి సిద్దబోయిన వెంకటేష్ , చింత రామానాధం , చర్ప నేతాజీ , పిన్నింటి దేవేందర్ రెడ్డి , బండారి చంద్రయ్య , కల్తీ నారాయణ , కడారి కృష్ణ , నెల్లూరి శివరాజ్ , పెంతల జయంత్ , మండల సోషల్ మీడియా కో ఆర్డినేటర్ గజ్జల రాజశేఖర్ తదితర నాయకులు పాల్గొన్నారు



చినరాయిగూడెంలో డిజిటల్ క్రాప్ సర్వే పరిశీలించిన AEO లక్ష్మణరావు.

మణుగూరు. సెప్టెంబర్ 19(డి డి 9వార్త)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,మణుగూరు మండలం లోని చినరాయిగూడెం గ్రామంలో డిజిటల్ క్రాప్ సర్వే (DCS) నిర్వహించారు. వాలంటీర్ కొమరం మధుకిరణ్ ఆధ్వర్యంలో సర్వే ప్రక్రియ కొనసాగింది.

డిజిటల్ క్రాప్ సర్వేలో భాగంగా నిర్దేశించిన ప్రతి సర్వే నంబర్‌కు సంబంధించి వాలంటీర్ సంబంధిత పొలానికి నేరుగా వెళ్లి, అక్కడ సాగులో ఉన్న పంటను పరిశీలించి ఫొటోను తీస్తారు. అనంతరం పంట వివరాలతో పాటు ఆ ఫొటోను డిజిటల్ క్రాప్ సర్వే యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు.ఈ సర్వే ప్రక్రియను వ్యవసాయ విస్తరణ అధికారి డా. కొమరం లక్ష్మణరావు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే నంబర్ వారీగా పంటల వివరాలు, పంట ఫొటోల నమోదును పరిశీలిస్తూ, సర్వేను క్షేత్రస్థాయిలో ఖచ్చితంగా మరియు పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో రైతులు తెల్లం నర్సింహారావు, కుంజ భద్రయ్య, కుంజ క్రిష్టయ్య, సత్యం, బత్తుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.




యువత సమస్యలపై నిరంతర పోరాటమే డీవైఎఫ్ ఐ లక్ష్యం

- **డీవైఎఫ్ ఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి కాళంగి హరికృష్ణ**

భద్రాచలం టౌన్, సెప్టెంబర్ 19 (డీడీ 9 వార్త)

యువత ఎదుర్కొంటున్న విద్య, ఉపాధి, ఉద్యోగ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ప్రజా ఉద్యమాలు నిర్వహించడమే డీవైఎఫ్ ఐ లక్ష్యమని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి కాళంగి హరికృష్ణ అన్నారు. శనివారం భద్రాచలంలో నిర్వహించిన డీవైఎఫ్ ఐ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశ భవిష్యత్తును నిర్మించే యువతకు నాణ్యమైన విద్య, ఉపాధి అవకాశాలు, గౌరవప్రదమైన ఉద్యోగాలు అందేలా ప్రభుత్వాలపై నిరంతరం ప్రజా ఉద్యమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. అందరికీ విద్య.. అందరికీ ఉద్యోగాలు అనే లక్ష్యంతో యువతను సంఘటితం చేసి విద్యా అవకాశాలు, ఉద్యోగ నియామకాలు, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కోసం ఐక్యంగా ఉద్యమించాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, నిరుద్యోగ సమస్య పరిష్కారానికి స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. డీవైఎఫ్ ఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు లిక్కి బాలరాజు మాట్లాడుతూ కేంద్రంలో ఎవరు అధికారంలో ఉన్నా, రాష్ట్రంలో ఎవరు అధికారంలో ఉన్నా యువత సమస్యలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ప్రభుత్వాలను ప్రశ్నించడం వ్యతిరేకత కాదని, అది ప్రజాస్వామ్య హక్కు అని పేర్కొన్నారు. యువత మౌనంగా ఉంటే సమస్యలు కొనసాగుతాయని, యువత ప్రశ్నిస్తే మార్పు మొదలవుతుందని అన్నారు.యువత తమ భవిష్యత్తును ఎవరో నిర్ణయిస్తారని ఎదురుచూడకుండా తమ హక్కుల కోసం తామే నిలబడాలని నాయకులు పిలుపునిచ్చారు. మౌనంగా ఉండే యువత చరిత్రను చదువుతుందని.. ప్రశ్నించే యువత చరిత్రను రాస్తుందని అన్నారు. యువత హక్కులు,



గోదావరి ఒడికి గణనాథులు

- **భద్రాచలంలో ప్రారంభమైన గణేశ్ నిమజ్జనాలు**
- **వివిధ ప్రాంతాల నుంచి తరలివస్తున్న విగ్రహాలు..**
- **గోదావరి తీరంలో భక్తి సందడి**

భద్రాచలం , సెప్టెంబరు 19 (డిడి9 వార్త)

దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాచలంలో గణేశ్ నిమజ్జనోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గోదావరి నదిలో గణనాథులను నిమజ్జనం చేసేందుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి విగ్రహాలు భద్రాచలం తరలివస్తున్నాయి. శనివారం నాటికి సుమారు 50 గణేశ్ విగ్రహాలు భద్రాచలం చేరుకున్నట్లు అధికారులు తెలిపారు.వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక వాహనాల్లో గణనాథులను తీసుకొచ్చిన భక్తులు, నిర్వాహకులు గోదావరి ఘాట్‌కు చేరుకుంటున్నారు. డప్పులు, మేళతాళాలు, భక్తుల జయజయధ్వానాల నడుమ గణనాథులకు వీడ్కోలు పలుకుతున్నారు. గోదావరి ఒడిలో విఘ్నేశ్వరుడిని నిమజ్జనం చేసి భక్తులు మొక్కులు చెల్లించుకుంటున్నారు. దీంతో భద్రాచలం పరిసర ప్రాంతాలు గణనాథుల సందడితో కళకళలాడుతున్నాయి.

పకడ్బందీగా ఏర్పాట్లు

గణేశ్ నిమజ్జనాల నేపథ్యంలో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా గోదావరి ఘాట్ వద్ద భద్రత, విద్యుత్, పారిశుద్ధ్యం, తాగునీరు తదితర సౌకర్యాలు కల్పిస్తున్నారు. నిమజ్జన ప్రక్రియ సజావుగా సాగేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు చేపడుతున్నారు.



గోదావరిలో నీటి ప్రవాహం, లోతును దృష్టిలో ఉంచుకుని నిమజ్జనం సమయంలో భక్తులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. పెద్ద సంఖ్యలో గణనాథులు తరలివస్తున్న నేపథ్యంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. గణేశ్ నిమజ్జన వేడుకలను తిలకించేందుకు స్థానికులతో పాటు పరిసర జిల్లాల నుంచి కూడా ప్రజలు భద్రాచలానికి తరలివస్తున్నారు. గణనాథుల నిమజ్జనాలతో భద్రాచలం గోదావరి తీరం భక్తి సందడితో కళకళలాడుతోంది.





ఘనంగా పైడాకుల అశోక్ జన్మదిన వేడుకలు..

సెప్టెంబర్ 19 డిడి 9 వార్త వెంకటాపురం.

ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ జన్మదిన వేడుకలను వెంకటాపురం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ హుస్సేన్ కేక్ కట్ చేసి కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈసందర్భంగానాయకులు,కార్యకర్తలుపైడాకుల అశోక్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలోపీఏసీ చైర్మన్ మోహన్‌రావు,భద్రాచలం బ్లాక్ అధ్యక్షులు శివ, వెంకటాపురం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సాయి, కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు చిట్యాల సాగర్,సీనియర్ నాయకులు



గిరిజన విద్యార్థులకు గ్రేస్ సర్వీస్ సొసైటీ అండ..

- **300 మంది విద్యార్థులకు బ్యాగులు, నోట్‌బుక్స్, పలకల పంపిణీ..**

సెప్టెంబర్ 19 డిడి9 వార్త వెంకటాపురం.

ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని గిరిజన గ్రామాల్లో చదువుతున్న పేద విద్యార్థులకు గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యా సామగ్రి పంపిణీ చేశారు. నూగూరు, వెంకటాపురం, శాంతినగర్, పాత్రాపురం ప్రభుత్వ పాఠశాలలకు చెందిన సుమారు 300 మంది విద్యార్థులకు బ్యాగులు, నోట్‌బుక్స్, పలకలను వెంకటాపురం పాఠశాలలో మండల విద్యా శాఖ అధికారి జీవి సత్యనారాయణ చేతుల మీదుగా అందజేశారు.

ఈ సందర్భంగా ఎంఈఓ జీవి సత్యనారాయణ మాట్లాడుతూ పల్లె, గిరిజన ప్రాంతాల్లో పేద విద్యార్థులను ప్రోత్సహిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న గ్రేస్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకులు బిషప్ మారినేని జాకబ్ను అభినందించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన సహకారం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మురళీ కృష్ణ రెడ్డి, కల ప్రసాద్, ముర్రం రాజేష్, కంతి ముత్తయ్య, లక్ష్మణరావు, ఆదిశివ, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.




ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.

- **ఆత్మీయ ఆహ్వానం పలికిన గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు.**

మణుగూరు. సెప్టెంబర్ 19(డి డి 9వార్త)

తెలంగాణలో అత్యంత వైభవోపేతంగా నిర్వహించే ఖైరతాబాద్ శ్రీశ్రీశ్రీ వరసిద్ధి వినాయక నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా, గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధుల ఆత్మీయ ఆహ్వానం మేరకు పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకున్నారు.

ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని గణనాథునికి పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుని ఆత్మీయంగా సత్కరించారు.



ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ చైర్మన్ వాణి, జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిషోర్ యాదవ్, ఉత్సవ కమిటీ సభ్యులు రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం గణేష్ నిమజ్జనానికి పటిష్ట భద్రత

- **భద్రాచలం గణేష్ నిమజ్జనానికి పటిష్ట భద్రత**
- **డీజేలు, క్రాకర్స్ కు అనుమతి లేదు: డీఎస్పీ అరుణ్ కుమార్**

భద్రాచలం టౌన్ , సెప్టెంబర్ 19 (డీడీ 9 వార్త)

భద్రాచలంలో నిర్వహించనున్న గణేష్ నిమజ్జన కార్యక్రమానికి పోలీసు శాఖ పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు డీఎస్పీ ఎం. అరుణ్ కుమార్ పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలించారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా చేపట్టాల్సిన భద్రతా చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. గణేష్ నిమజ్జనానికి వచ్చే భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని డీఎస్పీ అరుణ్ కుమార్ సూచించారు. ఎవరూ మద్యం సేవించి నిమజ్జన కార్యక్రమానికి రావద్దని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని స్పష్టం చేశారు. నిమజ్జన ఊరేగింపుల్లో డీజేలు, క్రాకర్స్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిమజ్జన ప్రాంతంలో విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల భద్రతతో పాటు నది పరిసరాల్లో రక్షణ చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన బందోబస్తు కోసం సుమారు 200 మంది పోలీసు అధికారులు, సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. నిమజ్జన ప్రాంతంలో డీడీఆర్ ఎఫ్, ఎస్ డీఆర్ ఎఫ్ రక్షణ బృందాలను కూడా అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ప్రజలు, గణేష్ ఉత్సవ కమిటీలు పోలీసు శాఖకు పూర్తి సహకారం అందించాలని డీఎస్పీ అరుణ్ కుమార్ విజ్ఞప్తి చేశారు.



జనగామపెద్దపహాడ్ యాదవుల 4.04 ఎకరాల భూమి అక్రమ రిజిస్ట్రేషన్ - అఖిల భారత యాదవ మహాసభ తీవ్ర ఖండన

జనగామ, సెప్టెంబర్ 19 (డిడి 9) వార్త

జనగామ జిల్లా పెద్దపహాడ్ గ్రామానికి చెందిన శ్రీ మల్లికార్జున గొర్రెల పెంపకం దారుల సంఘానికి చెందిన 4.04 ఎకరాల భూమి (స.నెం. 582/F, 583/G/5) ను ఉస్మానియా ఆగ్రో ఇండస్ట్రీస్ నకిలీ సంతకాలతో అక్రమంగా రిజిస్ట్రేషన్ (డాక్యు. నెం. 11/2007) చేసుకుందని 130 మంది సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. 2005లో తమ సంఘం పేరున ఉన్న భూమిని కబ్జా చేసి బెదిరిస్తున్నారని, కలెక్టర్, ఎమ్మార్వోలకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని వాపోయారు. విషయం తెలుసుకున్న అఖిల భారత యాదవ మహాసభ జిల్లా కమిటీ, మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ ఆధ్వర్యంలో వివాదాస్పద భూమిని సందర్శించి బాధితులకు సంఘీభావం తెలిపారు. అక్రమ రిజిస్ట్రేషన్‌పై విచారణ జరిపి భూమిని ఇప్పించాలని, లేకుంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బనుక సిద్దిరాజ్ యాదవ్, యువజన జిల్లా అధ్యక్షులు పురమాణి రజాక్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ తొట్టె నరేందర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి బొంగు ఐలయ్య యాదవ్, నాయకులు గాజుల సిద్దిలింగం యాదవ్, మేకల మహేనందు యాదవ్, సాదం మధుసూదన్ యాదవ్, బూస రమేష్ యాదవ్, దడిగే రవికుమార్ యాదవ్, మారబోయిన ప్రకాష్ యాదవ్, గంగుల మధు, కారే రమేష్, కారే కరుణాకర్ తదితరులు.





రాజ్యాంగాన్ని అవమానించిన ఘటనపై చర్యలు.

- **తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, పోలీసు శాఖకు కృతజ్ఞతలు తెలియజేసిన మాల సంఘాల జెఏసి అధ్యక్షులు చెట్టి సురేష్.**

మణుగూరు. సెప్టెంబర్ 19(డి డి 9వార్త)

భారత రాజ్యాంగాన్ని అవమానించేలా వ్యవహరించిన హమారా ప్రసాద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ దళిత సంఘాలు, మాల సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమాలకు స్పందించిన తెలంగాణ ప్రభుత్వం మరియు పోలీసు శాఖకు పినపాక నియోజకవర్గ మాల సంఘాల జేఏసీ అధ్యక్షులు చెట్టి సురేష్ కృతజ్ఞతలు తెలిపారు.

రాజ్యాంగ పరిరక్షణ కోసం దళిత సంఘాలు శాంతియుతంగా నిరసనలు చేసారని తెలియజేసారు. రాజ్యాంగాన్ని గౌరవించడం, దాని విలువలను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని, రాజ్యాంగాన్ని కించపరిచే ఘటనలు ఎవరు అవలంబించిన సహించబోమని పేర్కొన్నారు. ఈ అంశంపై స్పందించి చట్ట ప్రకారం చర్యలు తీసుకున్న తెలంగాణ ప్రభుత్వం, పోలీసు ఉన్నతాధికారులు మరియు పోలీసు సిబ్బందికి మాల సంఘాల జేఏసీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసింది.

అలాగే రాజ్యాంగ పరిరక్షణ కోసం నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్న దళిత సంఘాల నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలందరికీ మాల సంఘాల జేఏసీ తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మాల సంఘాల జేఏసీ నాయకులు వేల్పుల నరేష్, ముదిగొండ రామకృష్ణ,బూర్గుల కరుణాకర్,ధ్రువ కుమార్, దాసరి రవి తదితరులు పాల్గొన్నారు.

కులమతాలకు అతీతంగా వినాయకుడి లడ్డూను దక్కించుకున్న సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్..

- **కుటుంబ సభ్యులతో కలిసి లడ్డూ వేలం లో పాల్గొన్న ఇక్బాల్ హుస్సేన్..**
- **మత సామరస్యానికి, సోదరభావానికి నిదర్శనం..**

మణుగూరు. సెప్టెంబర్ 19(డి డి 9వార్త)

భద్రాద్రి జిల్లా,కరకగూడెం మండల కేంద్రంలో కొలువుదీరిన వినాయకుడి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పంచమ రాత్రులు ముగిసిన సందర్భంగా, కరకగూడెం గణేష్ ఉత్సవ కమిటీ, కౌండిన్య యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన లడ్డూ వేలం పాటలో కరకగూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కులమతాలకు అతీతంగా సర్వమానవ సౌభ్రాతృత్వం, సోదరభావంతో ముందుకొచ్చి స్వామివారి లడ్డూను ₹3,116/లకు లడ్డూను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ,మత సామరస్యం, పరస్పర గౌరవం, సోదరభావం ప్రతి ఒక్కరిలో పెంపొందాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.





రెడ్ క్రాస్ ఎన్నికలకు నోటిఫికేషన్

- **15 మంది సభ్యులతో ప్యానల్ గా నామినేషన్లు**

భద్రాచలం టౌన్ , సెప్టెంబరు 19 (డీడీ 9 వార్త)



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ అయింది. ఈ నెల 24న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు రూ.10 వేల డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది. ఈ డిపాజిట్ తిరిగి చెల్లించబడదని ఎన్నికల అధికారులు వెల్లడించారు. నామినేషన్ల పరిశీలన ఈ నెల 26న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరుగుతుంది. అదే రోజు పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించనున్నారు. అక్టోబర్ 4న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్ నిర్వహించనుండగా, అదే రోజు సాయంత్రం 4 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. ఈ ఎన్నికల్లో చల్లగుల్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 15 మంది సభ్యులతో కూడిన ప్యానల్ నామినేషన్లు దాఖలు చేయనున్నట్లు తెలిపారు. భద్రాచలం ప్రాంతంలో ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేసిన కాలంలో పేదలు, సామాన్య ప్రజలకు వివిధ రూపాల్లో సేవలందించానని నాగేశ్వరరావు పేర్కొన్నారు. తన సేవలను గుర్తించిన ప్రభుత్వం ఎనిమిది సార్లు ప్రశంసాపత్రాలు అందించడంతో పాటు నగదు పురస్కారంతో సత్కరించిందని తెలిపారు. గోదావరి వరదలు, పుష్కరాలు, శ్రీరామనవమి, ముక్కోటి ఉత్సవాల సమయంలో ప్రజలు, భక్తులకు సేవలందించినట్లు తెలిపారు. ఉద్యోగ సంఘాల జిల్లా అధ్యక్షుడిగా, పెన్షనర్ల జిల్లా అధ్యక్షుడిగా, భద్రాచలం డివిజన్ కెమిస్ట్స్ కార్యదర్శిగా, లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా వివిధ బాధ్యతలు నిర్వహిస్తూ ప్రజాసేవలో కొనసాగుతున్నానని చెప్పారు. తన సేవా అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికల్లో తన ప్యానల్ కు మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు.



పాత కక్షల నేపథ్యంలో వజ్జ బీమరాజు పై దాడి

- **కొన ఊపిరితో ఉన్న వ్యక్తిని 108లో ఆసుపత్రికి తరలింపు**

కరకగూడెం, సెప్టెంబర్ 19: (DD9 వార్త)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా. కరకగూడెం మండలంలోని వలస ఆదివాసీ గ్రామమైన అశ్వాపురంపాడులో వజ్జ బీమరాజుపై దాడి జరిగిన ఘటన కలకలం రేపింది. పాత కక్షల నేపథ్యంలోనే ఈ దాడి జరిగినట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు.
సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్నారు. అప్పటికే తీవ్ర గాయాలతో కొన ఊపిరితో ఉన్న బీమరాజును 108 అంబులెన్స్‌లో మణుగూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందించినట్లు సమాచారం. బీమరాజుకు భార్యతో పాటు ముగ్గురు కుమార్తెలు, ముగ్గురు కుమారులు ఉన్నారు. కుటుంబ పెద్దపై దాడి జరగడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. పాత కక్షలే దాడికి కారణమని గ్రామస్తులు చెబుతున్నప్పటికీ, ఘటనకు దారితీసిన అసలు కారణాలు, దాడికి పాల్పడిన వ్యక్తుల వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. ఘటనపై కరకగూడెం ఎస్ఐ పి.వి. నాగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం....

జనగామ అమ్మ ఫౌండేషన్

జనగామ సెప్టెంబర్19(డిడి9) వార్త

జనగామఈరోజు నవీన్ విరాట్ గారు జనగామ జిల్లా ఏరియా ఆసుపత్రి వద్ద వైద్యం కోసం వచ్చిన ప్రజలకు ఆల్పాహారం సమర్పణ చేసి మానవత్వం చాటుకున్నారుఈ సందర్భంగా జనగామ అమ్మ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు కోయాడ రవి ప్రధాన కార్యదర్శి వంగ భీమ్ రాజ్ గారు మాట్లాడుతూ ఈరోజు అల్పాహారం సమర్పణ చేసి మానవత్వం చాటుకున్న నవీన్ విరాట్ కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు భారతదేశంలో ఆకలి చావులు లేకుండా నియంత్రణే లక్ష్యంగా ప్రతి ఒక్కరు నిరాశ్రయులకు అనాధలకు నిరుపేద కుటుంబాలకు ఆకలితో ఉన్నవారికి త్రాగునీరు మహా అన్నదానం చేసి మనోత్సాన్ని చాటుకోవాలని ప్రజలకు యువతకు పిలుపునిచ్చారుసేవ కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు కోయాడ రవి, బొల్లం కనకరాజు మందసాయి బింగి నరసింహులు సిద్ధిరాల చందు పిట్టల కృష్ణ సతదితరులు పాల్గొన్నారు



మానవత్వానికి మారుపేరు.. మనోహర్ ప్రసాద్

చర్ల, సెప్టెంబర్ 19 (డిడి 9వార్త)



తాను పుట్టిన ఊరికి ఎంతోకొంత ఋణం తీర్చుకొనే ఉద్దేశంతో చర్ల మండల ప్రజలకు ఎన్నో సేవలందిస్తున్న మానవతావాది పరుచూరి మనోహర్ ప్రసాద్. పాఠశాలకు బల్లలు, కుర్చీలు, విద్యార్థినీ విద్యార్థులకు పుస్తకాలు, స్టేషనరీ సామాగ్రి, వారాంతపు అన్నదాన వితరణలు,వాల్ ఆఫ్ కైండ్ నెస్ కార్యక్రమాలు, రోగులకు ఆర్థిక సహాయం వంటి ఎన్నో సేవా కార్యక్రమాలను మీకోసం మేమున్నాం టీం ఆధ్వర్యంలో చేపట్టి, తనదైన దాతృత్వం చాటిన మనోహర్ ప్రసాద్ శనివారం వారి బంధువులైన అట్లూరి అనుపమ(ఆంధ్రప్రదేశ్) (కీ"శే గరిమల్ల కృష్ణార్జునరావు జ్ఞాపకార్థం) సుమారు 60 వేల రూపాయల విలువ గల ఆక్సిజన్ కాన్సంట్రేటర్ మిషన్ ను సంస్థకు వితరణగా ఇచ్చారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ లయన్ నీలి ప్రకాష్ దాతలకు కృతజ్ఞతలు తెలుపుతూ, ఈ మిషన్ ను మీకోసం మేమున్నాం టీం ఆధ్వర్యంలో మండలంలోని దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల సహాయార్థం 24/7 అందుబాటులో ఉంచడం జరుగుతుందని, వైద్యుల సలహా మేరకు ఎవరికైనా ఇంటికి తీసుకెళ్ళి ఉపయోగించే అవసరముంటే సంప్రదించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో పరుచూరి మనోహర్ ప్రసాద్, గొట్టిపాటి శ్రీనివాసరావు, దొడ్డి సూరిబాబు, గుమ్మడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిజాం షుగర్స్ తెరవాలి.. బకాయిలు చెల్లించాలి

- **-బోధన్‌లో ఫ్యాక్టరీ గేటు ఎదుట కార్మికులు, ఎంఐఎం నాయకుల ధర్నా**

బోధన్, నిజామాబాద్ జిల్లా, సెప్టెంబర్ 19(డిడి9 వార్త):



మూతపడిన బోధన్ నిజాం షుగర్ ఫ్యాక్టరీని పునఃప్రారంభించి, కార్మికుల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఫ్యాక్టరీ ప్రధాన గేటు ఎదుట కార్మిక సంఘాలు, ఎంఐఎం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు నాగుల రవిశంకర్ గౌడ్, ఉపేందర్, ఎంఐఎం కౌన్సిలర్లు రఫీక్, సమీర్, ఆప్ నాయకుడు జునైద్ మాట్లాడారు. గత 11 ఏళ్లుగా ఫ్యాక్టరీని లేఆఫ్‌లో పెట్టడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఫ్యాక్టరీని తెరిపిస్తామని ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. నిజాం షుగర్స్ సమస్యపై నిన్న శాసనసభలో మాట్లాడిన హైదరాబాద్ ఎంఐఎం ఎమ్మెల్యే బలాలాకు, పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీకి కార్మికుల తరపున ధన్యవాదాలు తెలిపారు. ప్రధాన ప్రతిపక్షం కూడా ఈ అంశంపై నోరు మెదపకపోవడం విచారకరమన్నారు. హైదరాబాద్ ఎమ్మెల్యే అసెంబ్లీలో కార్మికుల కోసం గళమెత్తుతుంటే, స్థానిక ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి నిద్రపోతున్నారా అని ప్రశ్నించారు. తక్షణమే ఎమ్మెల్యే స్పందించి ఫ్యాక్టరీని తెరిపించి, బకాయిలు ఇప్పించాలని, లేనిపక్షంలో అన్ని ప్రతిపక్ష పార్టీలతో కలిసి పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ పోరాటానికి మద్దతుగా నిలిచిన ఎంఐఎం పట్టణాధ్యక్షుడు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఇలియాజ్, కౌన్సిలర్లకు కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు బాలకృష్ణ, ఈరవేణి సత్యనారాయణ, కార్మికులు రాంబాబు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఈ బస్టాండుకు... ఇదేం మాయరోగం..!

- **ఆవరణంతా బురదమయం.. ప్రయాణికులకు నరకయాతన**
- **బస్సులు లోపలికి రాక.. రోడ్డుపైనే ప్రయాణికుల నిరీక్షణ**
- **ఫ్యాన్లు లేవు..చేతిపంపు పనిచేయదు.. మరుగుదొడ్లదీ అదే పరిస్థితి**
- **లక్షలు వెచ్చించి నిర్మించిన బస్టాండ్‌పై ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యమా..?**

ఏటూరునాగారం క్రైం, డి డి 9 వార్త, సెప్టెంబర్ 19:





తాడ్వాయి మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికులకు సౌకర్యం కల్పించాల్సిందిపోయి సమస్యల నిలయంగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన బస్టాండ్‌ను నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు, ప్రయాణికులు వాపోతున్నారు.

ఆవరణంతా బురద గుంటలే...

వర్షం పడితే బస్టాండ్ ఆవరణంతా బురదమయంగా మారుతోందని ప్రయాణికులు చెబుతున్నారు. బస్సులు బస్టాండ్‌లోకి సక్రమంగా రాకపోవడంతో ప్రయాణికులు రోడ్డుపైనే నిలబడి బస్సుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు, వృద్ధులు, మహిళలు బురదలో నడవాల్సి రావడం మరింత ఇబ్బందికరంగా మారిందంటున్నారు.

గంటల తరబడి నిరీక్షణ..

మండల పరిధిలోని మారుమూల గ్రామాల నుంచి బస్సుల కోసం వచ్చే ప్రయాణికులు గంటల తరబడి బస్టాండ్‌లో వేచి ఉండాల్సి వస్తోందని చెబుతున్నారు.పిల్లాపాపలతో, మూటాముల్లెలతో వచ్చిన వారు సరైన వసతులు లేక అవస్థలు పడుతున్నారని ప్రయాణికులు పేర్కొంటున్నారు.

ఫ్యాన్లు లేక ఉక్కపోత..

బస్టాండ్‌లో ప్రయాణికుల కోసం కనీస సౌకర్యాలు కూడా లేకపోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రయాణికులు వేచి ఉండే ప్రదేశాల్లో ఫ్యాన్లు లేకపోవడంతో ఉక్కపోతను భరించాల్సి వస్తోందని అంటున్నారు. ప్రయాణికుల సౌకర్యాల కోసం ఏర్పాటు చేయాల్సిన కనీస వసతుల విషయంలో అధికారులు దృష్టి సారించకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

చేతిపంపు పనిచేయదు.. మరుగుదొడ్లు నిరుపయోగం..

బస్టాండ్‌లోని చేతిపంపు పనిచేయకపోవడంతో దాహం వేసిన ప్రయాణికులు బయట నుంచి నీరు కొనుక్కోవాల్సి వస్తోందని చెబుతున్నారు. ఇక మరుగుదొడ్లు సైతం సక్రమంగా పనిచేయకపోవడంతో మహిళలు, వృద్ధులు,చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిర్మాణానికే ఖర్చు.. నిర్వహణకు పట్టింపు లేదా..?

ప్రజల సౌకర్యం కోసం లక్షలు వెచ్చించి నిర్మించిన బస్టాండ్‌ను సక్రమంగా నిర్వహించాల్సిన బాధ్యత ఆర్టీసీ అధికారులపై ఉందని స్థానికులు అంటున్నారు.అయితే హన్మకొండ2 డిపో అధికారులు, సంబంధిత ఆర్టీసీ ఉన్నతాధికారులు బస్టాండ్ సమస్యలపై తగిన దృష్టి సారించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

"రాజుల సొమ్ము రాజుల పాలేనా..?"

ప్రజా అవసరాల కోసం నిర్మించిన బస్టాండ్ నిర్వహణ ఇలా అధ్వానంగా మారితే లక్షల రూపాయల ప్రజాధనం వెచ్చించి నిర్మించడం వల్ల ప్రయోజనం ఏమిటని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు.సమస్యలు కళ్లముందే కనిపిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు స్పందించాలి..

తాడ్వాయి బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలను వెంటనే గుర్తించి బురద సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, బస్సులు బస్టాండ్‌లోకి సక్రమంగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.ఫ్యాన్లు ఏర్పాటు చేయడంతో పాటు తాగునీటి సౌకర్యాన్ని పునరుద్ధరించి, మరుగుదొడ్లను వినియోగానికి అనుకూలంగా మార్చాలని డిమాండ్ చేస్తున్నారు.ఆర్టీసీ ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

జూనియర్ కళాశాలలో తల్లి పేరుతో ఒక మొక్క కార్యక్రమం

- **ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ఒక మొక్కను పెంచండి**

బోనకల్,సెప్టెంబర్19, (డిడీ 9 వార్త):

బోనకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ లింగం నేని నళిని శ్రీ అధ్యక్షతన కళాశాల క్లబ్ మరియు జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో "ఏక్ పెడ్ కే నామ్ - తల్లి పేరుతో ఒక మొక్క" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి బోనకల్ గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి కొండ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.
ఈ సందర్భంగా సర్పంచ్ బానోతు జ్యోతి కొండ కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించాలని ఆమె పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో యువత కీలక పాత్ర పోషించాలని, మొక్కలను పెంచడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు.కార్యక్రమంలో విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై నినాదాలు చేస్తూ అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో మానవహారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ బానోతు కొండ, గ్రామపంచాయతీ కార్యదర్శి రాజేశ్వరి, జాతీయ సేవా పథకం కార్యక్రమ అధికారి అంతోటి తిరుపతిరావు, అధ్యాపకులు జోనతాన్ బాబు, రాజేంద్ర కుమార్, లక్ష్మీకాంతం, రామకృష్ణ, రమేష్, రాజేంద్ర, ప్రియ కుమార్ రెడ్డి, మురళీ కృష్ణ, శాంతి ప్రియ, గ్రంథాలయ అధికారి మోహన్,యూడీసీ మదర్ సాహెబ్, జశ్వంత్, బుజ్జమ్మ, అరుణతో పాటు జాతీయ సేవా పథకం వాలంటీర్లు పాల్గొన్నారు.







షైన్ హైస్కూల్లో స్టూడెంట్ కౌన్సిల్ ఎలక్షన్స్ నిర్వహణ

బోనకల్, సెప్టెంబర్ 19,(డిడీ9 వార్త):

స్థానిక షైన్ హై స్కూల్లో స్కూల్ స్టూడెంట్ కౌన్సిల్ ఎలక్షన్స్ చాలా ఘనంగా నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో మూడో తరగతి నుంచి పదవ తరగతి విద్యార్థుల వరకు పాల్గొన్నారు.. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచ్ బానోత్ జ్యోతి ఉప సర్పంచ్ బానోత్ కొండా విచ్చేశారు..ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఎలక్షన్స్ ని నిర్వహించడం అనేది చాలా మంచి విషయమని దీనివల్ల విద్యార్థులకు ఎలక్షన్స్ పట్ల అవగాహన ఏర్పడుతుందని అన్నారు. ఈ ఎలక్షన్స్ నిర్వహించినందుకు షైన్ హై స్కూల్ యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ షేక్ అస్సర్ పాషా మాట్లాడుతూ ఈ కార్యక్రమం వల్ల విద్యార్థులకు ఎలక్షన్ అంటే ఏమిటి? ఓటింగ్ అంటే ఏమిటి? ఓటింగ్ యొక్క ప్రాధాన్యత అనే అంశాల మీద ఒక అవగాహన వస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ షేక్ లాల్ మహమ్మద్, ప్రిన్సిపల్ అయిటి పాముల శ్వేత, అడ్మినిస్ట్రేటర్ డేగల వేలాద్రి, సోషల్ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, త్రివేణి, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.





బాలగణపతి మండపం వద్ద మహా అన్నదానం

జనగామ సెప్టెంబర్ 19 (డిడి 9 వార్త)బ్యూరో

రఘునాథపల్లి మండల పరిధిలోని ఇబ్రహీంపూర్ గ్రామంలోని ఏడో వార్డులో బాలగణపతి యూత్ ఆధ్వర్యంలో శనివారం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు బాలగణపతి మండపం వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు. గ్రామంలోని వివిధ వినాయక మండపాల వద్ద మూడేళ్లుగా ఏటా అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామ ప్రజలందరిపై వినాయకుడి కృపాకటాక్షాలు ఉండాలని,సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన భక్తులకు బాలగణపతి యూత్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు నూనె మల్లేష్, దోరగొల్ల కుమార్, పులి రామదాసు, పులి కార్తీక్, నల్ల నరేష్, ల్యాగాల సమ్మన్న, దోరగొల్ల శ్రీనివాస్, ల్యాగాల అనిల్, కౌడగాని కుమార్‌తో పాటు గ్రామ పెద్దలు, కాలనీవాసులు,యువకులు,భక్తులు పాల్గొన్నారు.

డీజేలు వద్దు.. భక్తి ముద్దు

- **సాంప్రదాయ భజనల మధ్య అర్కిడ్స్ పాఠశాలలో గణేష్ నిమజ్జనం**

కామారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 19(డిడి9 వార్త):

గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని కామారెడ్డి జిల్లా బిచ్కుంద అర్కిడ్స్ పాఠశాలలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో,సాంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు.డీజేలు, శబ్ద కాలుష్యానికి దూరంగా భక్తి సాంప్రదాయ భజనలతో వినాయకుడికి వీడ్కోలు పలికారు.ఈ సందర్భంగా పాఠశాల ఫౌండర్ గోపి మాట్లాడుతూ మన సంస్కృతి ,సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని,ఆధునికత పేరుతో సాంప్రదాయాలను మరచిపోవద్దని సూచించారు. డీజేలు వద్దు.. భక్తి ముద్దు అనే సందేశంతో భక్తిశ్రద్ధల మధ్య గణేష్ నిమజ్జనం నిర్వహించినట్లు తెలిపారు. భజనలు,ఆధ్యాత్మిక కార్యక్రమాల నడుమ విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు.కార్యక్రమంలో బిచ్కుంద ఏఎస్ఐ దేవరాజ్, పోలీస్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు వెంకట్ వారి ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.పాఠశాల యాజమాన్యం సాంప్రదాయ పద్ధతిలో నిమజ్జనం నిర్వహించడంపై పలువురు అభినందించారు.







ఎస్‌బీఐ ఫౌండేషన్ సహకారంతో నిరుద్యోగ యువతకు శిక్షణ..

- **పోలీస్, ఆర్మీ, పారామిలిటరీ ఉద్యోగాలే లక్ష్యంగా ఉచిత శిక్షణ**
- **బోనకల్ గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో కార్యక్రమం**
- **పంచాయతీ కార్యాలయంలో 10 కంప్యూటర్లు ఏర్పాటు**
- **పల్లె ప్రకృతి వనంలో శారీరక శిక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు**
- **అభ్యర్థులకు క్రమశిక్షణ శారీరిక వ్యాయామం పట్టుదల అవసరం**
- **సర్పంచ్ బానోతు జ్యోతి కొండ**

బోనకల్,సెప్టెంబర్ 19,డీడీ 9 వార్త):

గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు పోలీస్,ఆర్మీ, పారామిలిటరీ ఉద్యోగాలకు సిద్ధం చేయాలనే లక్ష్యంతో బోనకల్ గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఎస్‌బీఐ ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో యువతకు పోటీ పరీక్షలకు అవసరమైన శిక్షణ తో పాటు శారీరక దారుఢ్యానికి ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు.ఈ సందర్భంగా బోనకల్ గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి కొండ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువతలో ఎంతో ప్రతిభ ఉన్నప్పటికీ సరైన మార్గదర్శకత్వం, శిక్షణ, ఆర్థిక ఇబ్బందుల కారణంగా అనేక మంది తమ లక్ష్యాలను చేరుకోలేకపోతున్నారని అన్నారు. అలాంటి యువతకు అండగా నిలవాలనే ఉద్దేశంతో గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న యువతకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు పంచాయతీ కార్యాలయంలో 10 కంప్యూటర్లను ఏర్పాటు చేసి, అభ్యర్థులకు పోటీ పరీక్షల సన్నద్ధతకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పిస్తున్నామని చెప్పారు. కంప్యూటర్ ఆధారిత పరీక్షలకు అభ్యర్థులు సులభంగా సిద్ధమయ్యేలా అవసరమైన సదుపాయాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు.

అదేవిధంగా బోనకల్‌లోని పల్లె ప్రకృతి వనాన్ని శిక్షణ కేంద్రంగా వినియోగిస్తూ, పోలీస్, ఆర్మీ, పారామిలిటరీ ఉద్యోగాలకు అవసరమైన పరుగు, వ్యాయామం, శారీరక దారుఢ్య శిక్షణను ఉచితంగా అందిస్తున్నామని సర్పంచ్ తెలిపారు. గ్రామ యువతకు ఆరోగ్యకరమైన వాతావరణంలో శారీరక శిక్షణ అందించేందుకు ప్రకృతి వనంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

యువతకు అండగా బోనకల్ గ్రామపంచాయతీ:

నేటి పోటీ ప్రపంచంలో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలంటే కష్టపడి చదవడంతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధన ఎంతో అవసరమని బానోతు జ్యోతి కొండ అన్నారు. ముఖ్యంగా పోలీస్, ఆర్మీ, పారామిలిటరీ ఉద్యోగాల్లో చేరాలనుకునే యువత విద్యతో పాటు శారీరక సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.

అబ్బాయిలతో పాటు అమ్మాయిలకు కూడా సమాన అవకాశాలు కల్పిస్తూ శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంత యువతకు ఉచితంగా శిక్షణ, కంప్యూటర్ సౌకర్యం, శారీరక శిక్షణ అందుబాటులోకి తీసుకురావడం ద్వారా వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలన్నదే గ్రామపంచాయతీ పాలకవర్గం లక్ష్యమని పేర్కొన్నారు.

ఎస్‌బీఐ ఫౌండేషన్ సహకారం అభినందనీయం

బోనకల్ గ్రామ యువత కోసం గ్రామపంచాయతీ చేపడుతున్న కార్యక్రమానికి ఎస్‌బీఐ ఫౌండేషన్ సహకారం అందించడం అభినందనీయమని సర్పంచ్ అన్నారు. గ్రామీణ ప్రాంత యువతకు ఉద్యోగ అవకాశాల దిశగా మార్గ నిర్దేశం చేసేందుకు ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ విద్య, ఉద్యోగం, దేశ సేవ అనే లక్ష్యాలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణతో నిరంతరం శ్రమిస్తే ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించడం సాధ్యమేనని అన్నారు. అందుబాటులో ఉన్న ఈ ఉచిత శిక్షణ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ర్యాలీ.. వైద్య పరీక్షలు

కార్యక్రమంలో భాగంగా అభ్యర్థులతో కలిసి బోనకల్ మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం డాక్టర్ రవీందర్‌నాథ్ ఆధ్వర్యంలో అభ్యర్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. శిక్షణలో పాల్గొనే అభ్యర్థుల శారీరక సామర్థ్యం, ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో భవిష్య ప్రాజెక్ట్ మేనేజర్ జీ. శ్రీనివాస్, ఫీల్డ్ కోఆర్డినేటర్లు కే. వెంకటేశ్వరరావు, జి. గోపి, శారీరక శిక్షకులు ఎం.డి. హసద్, ఎం. కృష్ణమోహన్, గ్రామ పెద్దలు, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, ఎస్‌బీఐ ఫౌండేషన్, భవిష్య భారత్ సంస్థ నిర్వాహకులు, అభ్యర్థులు పాల్గొన్నారు.పోలీస్, ఆర్మీ, పారామిలిటరీ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ పొందాలనుకునే అభ్యర్థులు 6300691495, 8374844996 నంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.





వినాయక నిమజ్జనాల్లో డీజేలకు నో!

- **చెరువుల వద్ద పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలి సర్పంచ్‌లు, గ్రామపెద్దలకు రూరల్ సీఐ తిరుపతయ్య సూచనలు**

కామారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 19(డిడి9 వార్త):

వినాయక నిమజ్జనాలను ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించాలని రూరల్ సీఐ తిరుపతయ్య, ఎస్సై వి.కె. రాములు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, గ్రామపెద్దలకు బీర్కూర్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సూచించారు.నిమజ్జన వేడుకల్లో డీజేలు నిషేధించబడ్డాయని, ఎట్టి పరిస్థితుల్లోనూ డీజేలను వినియోగించరాదని స్పష్టం చేశారు. నిమజ్జన ఊరేగింపుల్లో శాంతిభద్రతలకు భంగం కలగకుండా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు.వినాయక విగ్రహాల నిమజ్జనం జరిగే చెరువులు, కుంటల వద్ద కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు.ముఖ్యంగా చిన్నారులు, యువకులు ప్రమాదకరంగా నీటిలోకి వెళ్లకుండా గ్రామపెద్దలు, గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అదేవిధంగా నిమజ్జన మార్గాల్లో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.విద్యుత్ తీగలు, స్తంభాల విషయంలో సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని ప్రమాదాలకు అవకాశం లేకుండా చర్యలు చేపట్టాలని సర్పంచ్‌లు, గ్రామపెద్దలకు తెలిపారు.నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా గ్రామాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.అనంతరం ఏర్పాటు చేసిన వినాయక భోజన కార్యక్రమంలో రూరల్ సీఐ తిరుపతయ్య స్వయంగా సర్పంచులకు, గ్రామపెద్దలు భోజనం వడ్డించారు.భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సీఐ తిరుపతయ్య, ఎస్సై వి.కె. రాములు కోరారు.ఈ కార్యక్రమంలో ఆయాగ్రామాల సర్పంచ్ లు, గ్రామపెద్దలు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.





వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన ఆర్‌డీవో

- **మార్గాలు, ఘాట్లలో వసతులపై సమీక్ష**

బోధన్, నిజామాబాద్, సెప్టెంబర్ 19(డిడీ9 వార్త):

వినాయక నిమజ్జనోత్సవం సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని బోధన్ ఆర్‌డీవో ఎం.విజయకుమారి అధికారులను ఆదేశించారు. శనివారం నిమజ్జన ఘాట్లతో పాటు గణేశ్ రథాల ఊరేగింపు మార్గాల్లో కల్పించిన మౌలిక వసతులను ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో కలిసి ఆమె క్షేత్రస్థాయిలో సమీక్షించారు. ఈ సందర్భంగా భీముడి గుట్ట నుంచి పసుపు వాగు వరకు ఉన్న మొదటి మార్గం, శక్కర్‌నగర్ రామాలయం నుంచి శక్కర్‌నగర్ గణేశుల బావి వరకు ఉన్న రెండో మార్గంలో విద్యుత్ సరఫరా, రహదారులు, భద్రతా ఏర్పాట్లను ఆరా తీసి పలు సూచనలు చేశారు. అనంతరం భీముడి గుట్ట సార్వజనిక్ గణేష్ మండలి, శక్కర్‌నగర్ రామాలయంలోని గణనాథులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా టిజిఎన్‌పిడిసిఎల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ప్రసాదం స్వీకరించారు. ఈ సమీక్షా కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి, ఏసీపీ పి.శ్రీనివాస్, తహసీల్దార్ పి.విఠల్, సీఐ వెంకట్ నారాయణ, మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, ఫ్లోర్ లీడర్ తూము శరత్ రెడ్డి, టిజిఎన్‌పిడిసిఎల్ డిఈఈ నగేష్ కుమార్, ఏఈఈ నాయిని కృష్ణ, ఆర్ అండ్ బి, అగ్నిమాపక, మున్సిపల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.







పత్తిలో సమగ్ర పోషక యాజమాన్యంతో అధిక దిగుబడులు

- **రైతులకు ఆత్మ ఆధ్వర్యంలో శిక్షణ**

డిడి9 వార్త గుడిహత్నూర్:

పత్తి సాగులో ఆధునిక సాంకేతిక పద్ధతులను పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్త డా. పబీష్ కుమార్ సూచించారు. ఆత్మ (వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ) ఆధ్వర్యంలో శనివారం తోషం రైతు వేదిక పరిధిలోని సేంద్రీయ వ్యవసాయం చేస్తున్న రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డా. పబీష్ కుమార్ మాట్లాడుతూ అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేస్తున్న పత్తిలో నానో యూరియా, నానో డీఏపీతో పాటు అవసరమైన సూక్ష్మపోషకాలను పిచికారీ చేయడం ద్వారా మొక్కలకు సమగ్ర పోషకాలు అందుతాయని తెలిపారు. దీంతో మొక్కల ఎదుగుదల, పంట దిగుబడి మెరుగుపడటంతో పాటు సాగు పెట్టుబడులు తగ్గే అవకాశం ఉంటుందని వివరించారు.

సమగ్ర సస్యరక్షణతో పురుగు నివారణ

మండల వ్యవసాయ అధికారి భగత్ రమేష్ మాట్లాడుతూ.. పత్తి పంటలో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. రసం పీల్చే పురుగుల ఉధృతిని తగ్గించేందుకు ఎకరాకు 10 పసుపు రంగు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. పురుగు ఉధృతిని బట్టి వేపనూనెను లీటరు నీటికి 5 మి.లీ. చొప్పున కలిపి పిచికారీ చేయాలని సూచించారు.అలాగే అవసరాన్ని బట్టి సిఫారసు చేసిన పురుగుమందులను వ్యవసాయ అధికారుల సూచనల మేరకు వినియోగించాలని తెలిపారు. పత్తికాయ కుళ్లు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా ఇతర సిఫారసు చేసిన శిలీంద్రనాశకాలను తగిన మోతాదులో పిచికారీ చేయాలని సూచించారు. గులాబీరంగు పురుగు ఉనికిని ముందుగానే గుర్తించేందుకు ఎకరాకు ఎనమిది లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని రైతులకు అవగాహన కల్పించారు.రైతులు శాస్త్రీయ పద్ధతులను పాటిస్తూ పంటను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, పురుగు ఉధృతి గుర్తించిన వెంటనే వ్యవసాయ అధికారులను సంప్రదించాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు వెంకటి, రాధిక, ఆవుల రమేష్, శ్రీకాంత్, అలీమ్ ఖాన్, పస్తపూర్ సతీష్, రవిందర్, పస్తపూరి బాలాజీ జునుగురు మహేష్ , ధన్‌రాజ్ తదితరులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.



వివేకానంద పాఠశాలలో ఘనంగా వినాయక నిమజ్జనం

ఆదిలాబాద్ జిల్లా: సోనాల మండలం: సెప్టెంబర్ 19: (డిడి 9 వార్త న్యూస్):

ఈరోజు సోనాల మండలకేంద్రంలోని వివేకానంద పాఠశాలలో ఏర్పాటుచేసిన వినాయక నిమజ్జనం శనివారం రోజు ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థుల నృత్యాలు అలరించాయి. పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణ చైతన్య, కరస్పాండెంట్ ఇస్తారి. డైరెక్టర్ కోస్నేట్టి శుద్ధదన్ మునిగల శ్రీధర్ పాఠశాల అధ్యాపక బృందం మరియు పోషకులు ఈ కార్యక్రమానికి విచ్చేసినిమజ్జన కార్యకమం విజయవంతం చేశారు



కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేయడానికి కృషి చేయాలి

- **బజార్‌హత్నూర్ మండల్ కన్వీనర్,బోథ్ మండల్ వైస్ ప్రెసిడెంట్ లను సన్మానించిన ఆదిలాబాద్ జిల్లా పి ఏ సి మెంబెర్ ఏలేటి అశ్విన్ రెడ్డి**

ఆదిలాబాద్ జిల్లా: బోథ్ మండలం

సెప్టెంబర్ 19: (డిడి 9 వార్త న్యూస్):

బోథ్ మండల్ వైస్ ప్రెసిడెంట్ గా నియమింపబడ్డ నడికుంట ప్రవీణ్ కు ఏలేటి అశ్విన్ రెడ్డి శుభాకాంక్షలు తెలియచేసి శాలువాతో సన్మానించారు. అశ్విన్ రెడ్డి మాట్లాడుతూ బోథ్ మండల్ లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పార్టీ పునర్నిర్మాణం లో భాగస్వాములు అవ్వాలని పాత కొత్త కార్యకర్తలందరినీ సమన్వయం చేసుకుంటూ అందరినీ కలుపుకుంటూ పార్టీ బలోపేతానికి పాటు పడాలని సూచించారు.ఆయనతో పాటు బజార్ హత్నూర్ మండల కన్వీనర్ కల్లెం విఠల్ కి శుభాకాంక్షలు తెలియచేస్తూ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గుడాల అనీష్,సీనియర్ నాయకులు నల్ల శ్రీకాంత్ రెడ్డి,నారాయణ,నవీన్ రెడ్డి,శ్రీకాంత్ రెడ్డి,సాగర్ రెడ్డి తదితరులు ఉన్నారు.





ఆధ్యాత్మిక చెంత న్యాయ అవగాహన సదస్సు

- **అతి దట్టమైన అడవుల్లోకి న్యాయాధికారి**

ఆదిలాబాద్ జిల్లా: బోథ్ మండలం: సెప్టెంబర్ 19: (డిడి 9 వార్త న్యూస్):

బోథ్ మండలంలోని నిగిని, బాబేర తండా, కైలాస్ టెక్డి గ్రామాలలో శనివారం న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగాదక్షిణ కైలాస శిఖరంగా పేరొందిన కైలాస్ టేక్డి వద్ద గల శివుడు కొలువై ఒకవైపు చుట్టూ పచ్చని సయాద్రి పర్వతాల గొలుసు కట్టు సొబగులు మరొకవైపు అంతా అతి దట్టమైన అడవిలో బోథ్ జూనియర్ సివిల్ జడ్జి కే సందీప్ కుమార్ అక్కడి ప్రాంతాల ప్రజలకు హక్కులు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రకృతి పర్యావరణాన్ని కాపాడుకుంటూ, తమ మనగడకు అవసరమైన హక్కులు చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ముఖ్యంగా చట్టాలను గౌరవిస్తూ నడుచుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా ఆధ్యాత్మికత మార్గంలో ప్రయాణిస్తూ పల్లె గ్రామీణ జనం ప్రతి ఒక్కరూ ఇక్కడి పచ్చని ప్రకృతిని సైతం కాపాడుకోవాలని, అడవి అమ్మ వంటిదని, ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుంబించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ జి పి పంద్రం శంకర్, న్యాయవాది కుమ్మరి విజయ్ కుమార్, లింభాజీ మహారాజ్, సర్పంచులు, రూప్ చంద్, జాదవ్ పద్మా రవి, మాజీ సర్పంచ్ బద్రు, బండు పటేల్, జైత్రం, గంగయ్య బాబులాల్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ మందిరంలో గణనాథుడికి పూజలు

ఆదిలాబాద్ జిల్లా: సోనాల మండలం: సెప్టెంబర్ 19: (డిడి 9 వార్త న్యూస్):

సోనాల మండల కేంద్రంలోని.... శ్రీ రామాలయంలో ,హిందూ ధర్మ జాగరణ మండలి వారి ఆధ్వర్యంలో... కొలువుదీరిన వినాయకుడికిఆరవ రోజు పూజలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు...



పగబట్టి... పక్కా స్కెచ్‌తో హతమార్చారు

- **-హరిబాబు హత్య కేసులో 'ఏ -1' సంతోష్ అరెస్ట్**
- **-కత్తి, కారు, ఆయుధాలు స్వాధీనం**
- **-వివరాలు వెల్లడించిన సీపీ సాయి చైతన్య**

నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 19(డీడీ9 వార్త) :

భార్య హత్య కేసులో బెయిల్‌పై వచ్చి జీవనం సాగిస్తున్న వ్యక్తిని ప్రతీకారంతో దారుణంగా హత్య చేసిన ఘటనలో ప్రధాన నిందితుడిని నిజామాబాద్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య శనివారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.కోరుట్లలో జరిగిన భార్య వైష్ణవి హత్య కేసులో హరిబాబు, అతడి తల్లి లక్ష్మి బెయిల్‌పై విడుదలయ్యారు. ప్రతీకార దాడుల భయంతో నిజామాబాద్‌లోని సాయినగర్‌కు మకాం మార్చి, ఆర్.ఆర్.చౌరస్తా వద్ద మొక్కజొన్న కంకులు విక్రయిస్తున్నారు. కాగా, వైష్ణవి హత్యకు ఎలాగైనా ప్రతీకారం తీర్చుకోవాలని భావించిన ఆమె బంధువు గంధం సంతోష్ (ఎ 1) తన కుటుంబ సభ్యులతో కలసి పథకం రచించాడు. ఈనెల 17న కారులో నిజామాబాద్ వచ్చి, పానీపూరి బండి వద్ద ఉన్న హరిబాబుపై కత్తితో మెడ, తలపై నరికి దారుణంగా హత్య చేసి పారిపోయాడు. ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలం, టెక్నికల్ ఎవిడెన్స్ ఆధారంగా నిందితుల కోసం 4 స్పెషల్ టీమ్స్ రంగంలోకి దిగాయి. నిజామాబాద్ జెటర్ బైపాస్ వద్ద సంతోష్‌ను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విశాఖపట్నం పారిపోవడానికి రైల్వేస్టేషన్‌కు వెళ్తుండగా పట్టుబడ్డాడని సీపీ తెలిపారు. నిందితుడి నుంచి హత్యకు వాడిన కత్తి, స్విఫ్ట్ డిజైర్ కారు, ఇతర ఆయుధాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. మిగతా నిందితులను కూడా త్వరలోనే అరెస్ట్ చేస్తామని స్పష్టం చేశారు. స్వల్ప వ్యవధిలోనే కేసును ఛేదించిన ఏసీపీ ప్రకాష్, సీఐ శ్రీనివాస్ రాజ్, ఏఐ యాదగిరి గౌడ్, సిబ్బందిని సీపీ అభినందించారు.



గణనాథుడి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

- **విద్యానగర్ గణేష్ మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన రాథోడ్ బాపూరావు**

ఆదిలాబాద్ జిల్లా (బ్యూరో): సెప్టెంబర్ 19: (డిడి 9 వార్త న్యూస్):



బోథ్ నియోజకవర్గం తాంసీ: తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షులు బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు తాంసీ మండలంలో పర్యటించారు. పర్యటనలో భాగంగా *విద్యానగర్ గణేష్ మండల్ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు గణేష్ మండపాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం రాథోడ్ బాపూరావు మాట్లాడుతూ.. విఘ్నాలను తొలగించే *గణనాథుడి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని కోరారు. యువత భక్తితో పాటు సేవా కార్యక్రమాల్లోనూ భాగస్వాములు కావాలని సూచించారు కార్యక్రమంలో గణేష్ మండల్ కమిటీ సభ్యులు, భక్తులు, టిఆర్ఎస్ పార్టీ నాయకులు స్థానికులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వరుస నేరాలకు పాల్పడుతున్న గోపాల్ సింగ్ షెకావత్‌పై పీడీ యాక్ట్

అదిలాబాద్ జిల్లా ఇచ్చోడ సెప్టెంబర్ 19

హత్య, హత్యాయత్నం, మోసం, బెదిరింపులు, దాడులు, వసూళ్లకు పాల్పడినట్లు కేసులు జాతీయ రహదారి NH44పై వాహనదారులు, ట్రాన్స్‌పోర్టర్లను భయభ్రాంతులకు గురిచేసిన నిందితుడుఇప్పటివరకు నిందితునిపై ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 12 కేసులు నమోదు ఇటీవల 2026లో సైతం మూడు కేసుల్లో నిందితుడిగా ఉన్న గోపాల్ సింగ్ షెకావత్ ప్రస్తుతం పశువుల అక్రమ రవాణా కేసులో రిమాండ్ నిందితుడు. చర్లపల్లి జైలుకు తరలింపు. ఇచ్చోడ రూరల్ సీఐ సిహెచ్. రమేష్ ఇచ్చోడ రూరల్ సీఐ సిహెచ్. రమేష్ తెలిపిన వివరాల ప్రకారం, ఆదిలాబాద్ పట్టణంలోని తాటిగూడకు చెందిన గోపాల్ సింగ్ షెకావత్ (32), ప్రజా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా వరుసగా నేరాలకు పాల్పడుతున్న నేపథ్యంలో తెలంగాణ ప్రమాదకర కార్య కలాపాల నిరోధక చట్టం-1986 (పీడీ యాక్ట్) కింద చర్యలు చేపడుతూ నిందితున్ని చర్లపల్లి జైలుకు తరలించడం జరిగిందని తెలిపారు. గతంలో హత్య, హత్యాయత్నం, మోసం, బెదిరింపులు, దాడులు, వసూళ్లకు సంబంధించిన పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న అతనిపై 2022లో ఆదిలాబాద్ 2 టౌన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ కూడా తెరిచారు.

నిందితుని పై జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 12 కేసులు నమోదు కాగా, 2026లో ఇటీవల నేరడిగొండ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 259/2026, గుడిహత్నూర్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 254/2026, ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 446/2026 కేసుల్లో గోపాల్ సింగ్ షెకావత్ నిందితుడిగా ఉన్నాడు. ఈ కేసుల్లో హత్యాయత్నం, మోసం, వసూళ్లు, ప్రజలపై దాడులు, బెదిరింపులకు సంబంధించిన నేరారోపణలు ఉన్నాయి. జాతీయ రహదారి NH 44పై వాహనదారులు, ట్రాన్స్‌పోర్టర్లను వేధిస్తూ ప్రజల్లో భయాందోళనలు సృష్టించే విధంగా వ్యవహరించినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ప్రస్తుతం నేరేడు కొండ పోలీస్ స్టేషన్ నందు పశువుల అక్రమ రవాణా కేసులో నిందితుడుగా ఉంటూ రిమాండ్ ఖైదీగా ఉండడం జరిగిందని తెలిపారు. ఇటీవల జరిగిన ఈ నేరాలు ప్రజా శాంతిభద్రతలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నందున, భవిష్యత్తులో ఇలాంటి కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించేందుకు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ గారి సిఫార్సు మేరకు జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఐఎఎస్ పీడీ యాక్ట్ కింద నిర్బంధ చర్యలు చేపట్టినట్లు ఇచ్చోడ రూరల్ సీఐ సిహెచ్. రమేష్ తెలిపారు. ప్రజల భద్రతకు విఘాతం కలిగించే నేర కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.






గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్‌ను బలోపేతం చేయడమే లక్ష్యం

- **బోథ్ మండలంలోని 21 గ్రామాలకు కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుల నియామకం**
- **బోథ్ మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మేరుగు భోజన్న**

ఆదిలాబాద్ జిల్లా: బోథ్ మండలం: సెప్టెంబర్ 19: (డిడి 9 వార్త న్యూస్):

కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో "సంఘటన్ సృజన్ అభియాన్"లో భాగంగా బోథ్ మండలంలోని 21 గ్రామాలకు కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులను నియమించినట్లు మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మేరుగు భోజన్న తెలిపారు.* ఏఐసీసీ, టీపీసీసీ, డిసిసి నాయకత్వం మార్గదర్శకాలకు అనుగుణంగా చేపట్టిన ఈ నియామకాల ద్వారా గ్రామస్థాయిలో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్టం చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. నూతన అధ్యక్షులు కార్యకర్తలను సమన్వయం చేస్తూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.* మేరుగు భోజన్న మాట్లాడుతూ గ్రామస్థాయి కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి వెన్నెముక. ప్రతి గ్రామంలో పార్టీ శ్రేణులను సమన్వయం చేసి కాంగ్రెస్‌ను ప్రజలకు మరింత చేరువ చేయడమే మా లక్ష్యం. నూతన అధ్యక్షులు బాధ్యతాయుతంగా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలి అని అన్నారు.

నూతనంగా నియమితులైన గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులకు ఆయన అభినందనలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ గోర్ల రాజు యాదవ్, టీ పీ సీ సీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు కుర్మే మహేందర్, ఎస్ సి సెల్ అధ్యక్షులు ఆశన్న, ఎస్ సి/ఎస్ టి అట్రాసిటీ జిల్లా అధ్యక్షులు అంజయ్య, మండల అధికార ప్రతినిధి అచ్యుత్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు కౌసర్, ప్రధాన కార్యదర్శి అబూద్, ఉమేష్ జాదవ్, తాజా మాజీ ఏ ఎం సి చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, మాజీ బ్లాక్ అధ్యక్షులు మేరుగు నరసింహాదాస్, నీ ఏసీఎస్ డైరెక్టర్ చాట్ల ఉమేష్, మాజీ ఎంపీటీసీ షేక్ తదితరులతో పాటు కాంగ్రెస్ నాయకులు బొజ్జు సాయన్న, అలీం, జగన్, అబ్రార్, అమీరోదిన్ పాల్గొన్నారు.





జిల్లా కలెక్టరేట్‌లో వినాయకుడికి ప్రత్యేక పూజలు

- **పాల్గొన్న కలెక్టర్ భవేష్ మిశ్రా, సీపీ సాయిచైతన్య**

నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 19(డీడీ9 వార్త) :

వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ ప్రాంగణంలో ప్రతిష్టించిన గణనాథునికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా, పోలీస్ కమిషనర్ పి.సాయిచైతన్య, అదనపు కలెక్టర్ వి.భుజంగరావు పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో వారు స్వయంగా పాల్గొని సిబ్బందికి, భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణ్ రెడ్డి నిర్వహించగా, జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీకాంత్ రెడ్డి, సివిల్ సప్లైస్ డీఎం ప్రవీణ్ సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా, అదనపు డీసీపీ శుభం నగ్రాలే, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్ఓ గీత, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, కలెక్టరేట్ ఏఓ బాలరాజు, సూపరింటెండెంట్లు శ్రీనివాస్, ప్రశాంత్, భాస్కర్లతో పాటు కలెక్టరేట్‌లోని వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాలలు ఇలా ఉండాలి

DD ,9 వార్తలు అదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం సెప్టెంబర్ 19

ఇచ్చోడ: తెలంగాణ విద్యా కమిషన్ మాజీ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి ఆధ్వర్యంలోని తెలంగాణ పీపుల్స్ ఫ్రంట్ బస్సు యాత్ర ఇచ్చోడ మండలం జామిడీ గ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలు ఎలా ఉండాలి.. విద్యార్థులకు ఎలాంటి సౌకర్యాలు కల్పించాలనే అంశాలను డిస్‌ప్లేల ద్వారా ప్రత్యక్షంగా చూపించారు.

పాఠశాల భవనాలు, తరగతి గదులు, విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు, ఆటస్థలాలు, తాగునీరు, మరుగుదొడ్లు, గ్రంథాలయం తదితర సౌకర్యాలతో ప్రభుత్వ పాఠశాలలు ఆదర్శంగా ఉండే విధానాన్ని డిస్‌ప్లేలలో వివరించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు అన్ని వసతులు కల్పించినప్పుడే ప్రభుత్వ విద్యా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు.

ఈ సందర్భంగా ఆకునూరి మురళితోపాటు తెలంగాణ పీపుల్స్ ఫ్రంట్ బృంద సభ్యులు విద్యా వ్యవస్థకు సంబంధించిన అంశాలను గ్రామస్థులకు వివరించారు. కార్యక్రమంలో గ్రామస్థులు, యువత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



కషాయాల తయారీ కొరకు మొక్కల పంపిణీ

ఆదిలాబాద్ జిల్లా: బోథ్ మండలం: సెప్టెంబర్ 19:(డిడి 9 వార్త న్యూస్):

ఈరోజు పట్నాపూర్ గ్రామంలో సర్పంచ్ పంద్రం సుగుణ మేడం ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం (ఎన్ ఎం ఎం ఎఫ్) చేసే రైతులకు కషాయాల తయారీ కొరకు మొక్కలను పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రవితేజ మరియు క్లస్టర్ పరిధిలోని ఏఈవోలు కొట్టూరి రామ్, సిహెచ్ కృష్ణపాల్, జక్క సంతోష్, కృషి సఖి లు దేవకన్య, జోష్ణ మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు



తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సినిమా ప్రదర్శన

- **సొనాల మండల కేంద్రం వివేకానంద గణేష్ మండలి వద్ద"ఇరుముడి" సినిమా ప్రదర్శన**

ఈరోజు సొనాల మండల కేంద్రంలోని , యువతీ యువకులు, భక్తులు వివేకానంద విగ్రహం వద్దకు చేరుకుని ఇరుముడి సినిమా ప్రదర్శనను వీక్షించారు ఈ కార్యక్రమంలో కాలనీవాసులు గ్రామస్తులు పిల్లలు పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు









గణేశ్ నిమజ్జనానికి పక్కా ఏర్పాట్లు

- **ఉమ్మెడ, యంచ, గుండ్ల చెరువుల వద్ద క్షేత్రస్థాయి పరిశీలన**
- **శోభాయాత్ర మార్గాలను తనిఖీ చేసిన కలెక్టర్, సీపీ**
- **8 అడుగులు దాటిన విగ్రహాలు ఉమ్మెడ వైపే.. డీజేలపై నిషేధం**

నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 19(డీడీ9 వార్త) :

జిల్లా వ్యాప్తంగా వినాయక నిమజ్జనోత్సవాన్ని అత్యంత వైభవంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం మరియు పోలీస్ యంత్రాంగం సంయుక్తంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టాయి. శనివారం జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా, పోలీస్ కమిషనర్ పి.సాయిచైతన్య ప్రత్యేక బస్సులో వివిధ శాఖల అధికారులతో కలిసి శోభాయాత్ర సాగే ప్రధాన మార్గాలను, నిమజ్జన ఘాట్లను క్షేత్రస్థాయిలో అంగుళమంగుళం తనిఖీ చేశారు. నగరంలోని దుబ్బా ప్రాంతం నుంచి వినాయకుడి బావి వరకు ఉన్న శోభాయాత్ర రూట్‌ను, యంచ గోదావరి వంతెన, నందిపేట మండలంలోని ఉమ్మెడ గోదావరి తీరం, ఆర్మూర్‌లోని గుండ్ల చెరువు, బాసరా వంతెన ప్రాంతాలను అధికారులు నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ.. శోభాయాత్ర సాగే మార్గాల్లో గుంతలు పడిన రహదారులకు పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్, చెట్ల కొమ్మల వల్ల ఊరేగింపునకు ఎలాంటి ఆటంకం కలగకుండా చెట్లను నరికివేయాలని, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను పైకి లాగి సరిచేయాలని స్పష్టం చేశారు. జానకంపేట్ రైల్వే క్రాసింగ్ వద్ద హైవోల్టేజ్ విద్యుత్ లైన్ ఉన్నందున 8 అడుగులకు పైగా ఎత్తు ఉన్న విగ్రహాలను ఆ మార్గంలో అనుమతించలేమని తేల్చి చెప్పారు. అటువంటి భారీ విగ్రహాల కోసం ప్రత్యామ్నాయంగా ఉమ్మెడ గోదావరి వంతెన వద్ద ప్రత్యేక నిమజ్జన ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. నిమజ్జన ఘాట్ల వద్ద అవసరమైనన్ని భారీ క్రేన్లు, నిరంతర విద్యుత్ వెలుగులు, లైటింగ్, జనరేటర్లు, మెడికల్ క్యాంపులు, అంబులెన్సులు సిద్ధంగా ఉంచాలని, ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు.

డీజేలకు అనుమతి లేదు: సీపీ



పోలీస్ కమిషనర్ పి.సాయిచైతన్య మాట్లాడుతూ.. నిమజ్జన శోభాయాత్రలో డీజేల వినియోగానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదని పునరుద్ఘాటించారు. నిబంధనలు దాటితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశామని, విధుల్లో ఉండే పోలీస్, రెవెన్యూ సిబ్బంది క్రమశిక్షణతో వ్యవహరిస్తూ ప్రజలకు, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఆదేశించారు. ప్రజలు, గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసు శాఖకు పూర్తి సహకారం అందించి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం నగరంలోని వినాయకుని బావి వద్ద సార్వజనిక్ గణేష్ మండలి ప్రతినిధులతో సమావేశమై నిమజ్జన ఏర్పాట్లపై సమాలోచనలు జరిపారు. ఈ పర్యటనలో ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా, జాయింట్ కలెక్టర్ భుజంగరావు, అదనపు డీసీపీలు శుభం ప్రకాష్, శుభం నగ్రాలే, ట్రైనీ కలెక్టర్ సురేష్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఏసీపీలు ప్రకాష్ యాదవ్, వెంకటేశ్వర్ రెడ్డి, మస్తాన్ అలీ, మున్సిపల్, ఆర్ అండ్ బీ, అగ్నిమాపక, ఫిషరీస్, రెవెన్యూ, రవాణా, విద్యుత్, వైద్యారోగ్య తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.





ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలి

- **ఎడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అసిస్టెంట్ కలెక్టర్ తనిఖీలు**

బోధన్, నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 19(డీడీ9 వార్త) :

ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద రోగులకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని అసిస్టెంట్ కలెక్టర్ సురేష్ ఐఏఎస్ పేర్కొన్నారు. శనివారం ఎడపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించి, ఆసుపత్రిలోని వివిధ విభాగాలను విస్తృతంగా తనిఖీ చేశారు. ముందుగా ఆసుపత్రిలోని ఓపీ, ఐపీ వార్డులు, ల్యాబ్, బయోమెడికల్ వేస్ట్ నిర్వహణను పరిశీలించారు. అనంతరం ఫార్మసీ రూమ్, డ్రగ్ స్టోర్‌ను తనిఖీ చేసి మందుల నిల్వలను, గడువు తేదీలను సరి చూశారు. గడువు ముగిసే దశలో ఉన్న మందులను ముందుగానే గుర్తించి, వాటిపై స్పష్టమైన సూచనలు ఉంచాలని ఫార్మసిస్టుకు మార్గదర్శకాలు జారీ చేశారు. రోగులతో స్వయంగా మాట్లాడి వైద్యాధికారుల పనితీరు, మందుల పంపిణీపై ఆరా తీశారు. ఆపరేషన్, హాజరు రిజిస్టర్లను తనిఖీ చేసిన ఆయన, ఆశా కార్యకర్తల హాజరు, విధి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎన్‌సీడీ సేవలు, జ్వర సర్వేలు, ఏఎన్‌సీ, పీఎన్‌సీ కేసుల నమోదును వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. వైద్యులు, సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ ప్రజారోగ్య పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రైతులకు కరెంటు.. సాగుకు నీళ్లు ఇవ్వాలి

- **పెబ్బేరులో కేటీఆర్ ర్యాలీ..**
- **కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు**

వనపర్తి, సెప్టెంబరు 19(ప్రజాక్షేత్రం):

రైతులకు నాణ్యమైన విద్యుత్తు, సాగునీరు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. శనివారం వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలోని సబ్‌స్టేషన్ నుంచి సుభాష్ చౌరస్తా వరకు రైతులతో కలిసి నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు. రోజుకు 10-12 సార్లు కోతలు పెబ్బేరు, గుమ్మడం సబ్‌స్టేషన్లను పరిశీలించిన సందర్భంగా రైతులు విద్యుత్తు సమస్యలను తమ దృష్టికి తీసుకొచ్చారని కేటీఆర్ తెలిపారు. ఐదారు గంటలు కూడా సక్రమంగా విద్యుత్తు సరఫరా కావడం లేదని రైతులు చెబుతున్నారని పేర్కొన్నారు. అధికారులు మాత్రం 12 గంటల విద్యుత్తు ఇస్తున్నామని చెబుతున్నారని, వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉందన్నారు. రోజుకు 10-12 సార్లు విద్యుత్తు సరఫరా నిలిచిపోతుండటంతో స్టార్టర్లు, మోటార్లు కాలిపోతున్నాయని తెలిపారు.

జూరాల ఆయకట్టుకు నీటి కొరత కృష్ణా నదికి 248 టీఎంసీల నీరు వచ్చినప్పటికీ పాలమూరు రైతులకు తగినంత సాగునీరు అందడం లేదని కేటీఆర్ ఆరోపించారు. జూరాల కింద కేవలం 18 టీఎంసీల నీటినే ఇచ్చారని, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద 10 టీఎంసీలకు మించి నీరు అందలేదని పేర్కొన్నారు. కల్వకుర్తి పంపులను సక్రమంగా నడపడం లేదని విమర్శించారు. జూరాల కింద ఉన్న లక్షా పది వేల ఎకరాల ఆయకట్టులో ఒక్క ఎకరం కూడా ఎండిపోకుండా రైతుల తరపున పోరాడతామని అన్నారు. 'రైతుబంధు'పై విమర్శలు కాంగ్రెస్ ప్రభుత్వం మూడుసార్లు రైతుబంధు నిధులు నిలిపివేసిందని, రైతుబీమా ప్రీమియం విషయంలోనూ రైతులకు ఇబ్బందులు ఎదురయ్యాయని కేటీఆర్ ఆరోపించారు. సీఎం సొంత జిల్లాలోనే రైతులు విద్యుత్తు కోసం రోడ్డెక్కే పరిస్థితి ఏర్పడిందన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు దాదాపు 90 శాతం పూర్తిచేసినప్పటికీ ప్రస్తుత ప్రభుత్వం వాటిని ముందుకు తీసుకెళ్లడం లేదని విమర్శించారు.

'పాలమూరు రైతుల కోసం పోరాటం'

పెబ్బేరు ప్రాంతంలో వెయ్యి ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చారని కేటీఆర్ పేర్కొన్నారు. శ్రీశైలం నుంచి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నీటిని తీసుకెళ్తున్నా తెలంగాణ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రైతుల ప్రయోజనాలే బీఆర్ఎస్‌కు ముఖ్యమని, వారి సమస్యల పరిష్కారం కోసం పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. కర్ణాటకతో చర్చించి రైతుల అవసరాలకు అనుగుణంగా నీటిని విడుదల చేయించాలని డిమాండ్ చేశారు.


కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "నల్లమల పులి కాదు.. చంద్రబాబు సంకలో పిల్లి" అంటూ వ్యాఖ్యానించారు.


సాంకేతికతను సమాజ హితానికి వాడాలి

- **-'ఎన్ఎన్ హ్యాకథాన్-2026'లో సీపీ పి.సాయిచైతన్య**
- **-ఏఐ ఆధారిత ప్రాజెక్టుల పరిశీలన.. విజేతలకు ప్రశంసాపత్రాలు**

నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 19(డీడీ9 వార్త) :

యువత మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడంతో పాటు దానిని సమాజ శ్రేయస్సుకు, దేశ అభివృద్ధికి ఉపయోగించాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయిచైతన్య పిలుపునిచ్చారు. నిజామాబాద్ నగరంలోని ఐటీ టవర్స్‌లో 'ఎన్ఎన్ ఏఐ సొల్యూషన్స్' ఆధ్వర్యంలో నిర్వహించిన "ఎన్ఎన్ హ్యాకథాన్ 2026 - కోడ్ ఫర్ చేంజ్" కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు, యువత, సాంకేతిక నిపుణులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారంగా రూపొందించిన వినూత్న ప్రాజెక్టులు, సామాజిక సమస్యల పరిష్కార నమూనాలను సీపీ నిశితంగా పరిశీలించి ఆయా వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీపీ మాట్లాడుతూ.. ఆధునిక సమాజంలో ఏఐ సాంకేతికత కీలక భూమిక పోషిస్తోందన్నారు. పోలీసు వ్యవస్థలోనూ నేరాల నియంత్రణ, భద్రత, ట్రాఫిక్ నిర్వహణ, డేటా విశ్లేషణకు ఆధునిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తున్నామని తెలిపారు. యువతలో ఉన్న సృజనాత్మకతకు సరైన వేదికలు లభిస్తే అద్భుతాలు సృష్టించవచ్చన్నారు. ఇదే సమయంలో రహదారి భద్రతపై యువత ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గత 2025 సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల కారణంగా 327 మంది ప్రాణాలు కోల్పోయారని, కరోనా సమయంలోనూ 200 మంది మాత్రమే మృతి చెందారని గుర్తు చేస్తూ వాహనాలు నడిపే సమయంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు. సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, డ్రగ్స్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. హ్యాకథాన్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎన్ ఏఐ సొల్యూషన్స్ సీఈఓ నజీబ్, మేనేజర్ షేక్ సబ్బార్, కాకతీయ కళాశాల ప్రిన్సిపాల్ రజనీకాంత్, నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.







సాలూరలో సిఎమ్ఆర్ఎఫ్ చెక్కులు, స్మార్ట్ కార్డుల పంపిణీ

బోధన్, నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 19(డీడీ9 వార్త) :


సాలూర మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు, బోధన్ శాసనసభ్యులు సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు, నూతన రేషన్ స్మార్ట్ కార్డులను శనివారం తహశీల్ కార్యాలయ ఆవరణలో పంపిణీ చేశారు. తహశీల్దార్ అజ్మత్ నవాజ్ తో కలిసి మండల కాంగ్రెస్ నాయకులు చేతుల మీదుగా ఈ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని 10 మంది బాధితులకు మంజూరైన రూ.3 లక్షల 50 వేల విలువగల సిఎమ్ఆర్ఎఫ్ చెక్కులతో పాటు, అర్హులైన కుటుంబాలకు రేషన్ స్మార్ట్ కార్డులను అందజేశారు. సహాయం పొందిన లబ్ధిదారులు మాట్లాడుతూ.. తమ కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్నాయకులు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వృద్ధురాలికి తీవ్ర గాయాలు

- **వెంటనే స్పందించి ఆసుపత్రికి తరలించిన '108' టీమ్**
- **బాధితురాలి బంగారం, నగదును కుటుంబీకులకు అప్పగింత**

బోధన్, నిజామాబాద్ జిల్లా , సెప్టెంబర్ 19(డీడీ9 వార్త) :

ఎడపల్లి కొత్త బస్టాండ్ ప్రాంతంలో శనివారం సాయంత్రం ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో మంగల్‌పాడుకు చెందిన భూమవ్వ అనే వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. రహదారిపై నడుచుకుంటూ వెళ్తున్న ఆమెను వేగంగా వచ్చిన బైక్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన ఎడపల్లి 108 ఈఎంటీ లక్ష్మణ్, పైలట్ నరేష్ క్షణాల్లో స్పందించి వృద్ధురాలికి ప్రథమ చికిత్స చేశారు. అనంతరం ఆమెను నిజామాబాద్ జిల్లా ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడారు. చికిత్స సమయంలో భూమవ్వ వద్ద ఉన్న బంగారు మంగళ సూత్రం, కొంత నగదు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న సిబ్బంది, వాటిని ఆమె కుమారుడు గంగాధర్‌కు భద్రంగా అప్పగించి తమ నిజాయితీని చాటుకున్నారు. ప్రాణాపాయం నుంచి కాపాడి, వస్తువులను తిరిగి ఇచ్చిన 108 సిబ్బంది సమయస్ఫూర్తికి, నిబద్ధతకు పలువురు ప్రశంసలు కురిపించారు.



ప్రపంచ కప్‌కు ముందు అతడికి మరిన్ని అవకాశాలు ఇవ్వాలి..

టీమిండియాకు ఇర్ఫాన్ సూచన

- జైస్వాల్‌కు వన్డేల్లో మరిన్ని అవకాశాలు ఇవ్వాలన్న పఠాన్
- ప్రపంచకప్ ముందు అతడికి తగినంత అనుభవం అవసరమని సూచన
- వెస్టిండీస్‌తో సెప్టెంబర్ 27 నుంచి వన్డే సిరీస్
- యువ ఆటగాళ్లకు సిరీస్ మంచి అవకాశమన్న ఇర్ఫాన్
- ప్రపంచకప్‌కు ముందు బెంచ్ బలాన్ని పరీక్షించాలని సూచన

డీడీ9 వార్త :

వెస్టిండీస్‌తో జరగనున్న వన్డే సిరీస్‌పై టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌కు ఎక్కువ అవకాశాలు ఇవ్వాలని సూచించాడు. 2027 వన్డే ప్రపంచకప్ నాటికి అతడు తగినన్ని మ్యాచ్‌లు ఆడి ఉండాలని చెప్పాడు.

వెస్టిండీస్‌తో భారత్ మూడు వన్డేల సిరీస్ ఆడనుంది. సెప్టెంబర్ 27 నుంచి స్వదేశంలో ఈ పోటీలు మొదలవుతాయి. ఈ సిరీస్‌లో జైస్వాల్‌కు ఎన్ని అవకాశాలు వస్తాయో చూడాలని ఉందని పఠాన్ అన్నాడు.

జైస్వాల్ ప్రస్తుతం భారత జట్టులో బ్యాకప్ ఓపెనర్‌గా ఉన్నాడని పఠాన్ చెప్పాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్, రోహిత్ శర్మ తర్వాత అతడు మూడో ఓపెనర్‌గా ఉన్నాడన్నాడు. ఇప్పటివరకు ఆడిన ఆరు వన్డేల్లో జైస్వాల్ రెండు సెంచరీలు చేశాడని గుర్తు చేశాడు. ప్రపంచకప్ సమయానికి బ్యాకప్ ఓపెనర్‌కు తగినంత అనుభవం ఉండాలని చెప్పాడు.

ఆసియా క్రీడల్లో భారత్ పూర్తి స్థాయి టీ20 జట్టుతో బరిలోకి దిగనుంది. దీంతో వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌లో కొందరు కొత్త ఆటగాళ్లకు అవకాశం దక్కింది. నితీశ్ కుమార్ రెడ్డి, ఆకిబ్ నబీ, నమన్ ధీర్ వంటి ఆటగాళ్లు తమ సత్తా చూపే అవకాశం ఉందని పఠాన్ అన్నాడు. జురెల్, గుర్నూర్ బ్రార్ కూడా అవకాశాలను ఉపయోగించుకోవాలని చెప్పాడు.

ప్రపంచకప్‌కు ముందు భారత్ మరో 11 వన్డేలు ఆడనుందని పఠాన్ తెలిపాడు. ఈ మ్యాచ్ లలో బెంచ్ బలాన్ని పరీక్షించడం ముఖ్యమన్నాడు. ఆసియా క్రీడలు, వెస్టిండీస్ సిరీస్ ఒకేసారి రావడం యువ ఆటగాళ్లకు మంచి అవకాశమని చెప్పాడు.

నమన్ ధీర్ ప్రతిభను తాను ఎంతగానో మెచ్చుకుంటానని పఠాన్ అన్నాడు. దేశవాళీ క్రికెట్‌లో అతడి ప్రదర్శనతో పాటు ఆఫ్‌స్పిన్ సామర్థ్యం కూడా ఎంపికకు కారణమైందని చెప్పాడు. వాషింగ్టన్ సుందర్ ఆసియా క్రీడలతో అందుబాటులో లేకపోవడంతో ఆఫ్‌స్పిన్నర్ అవసరం ఉందన్నాడు. రియాన్ పరాగ్ గాయంపై కూడా ఆందోళన ఉందని పేర్కొన్నాడు.



ఏషియన్ గేమ్స్‌కు ముందు టీమిండియాకు కిట్ టెన్షన్.. కొందరికి ఇంకా అందని జెర్సీలు!

- ఆదివారం జపాన్‌కు బయలుదేరనున్న టీమిండియా
- కొందరు ఆటగాళ్లకు ఇంకా అందని కిట్లు
- సైజింగ్ సమస్యలు ఇప్పటికే పరిష్కారం
- కిట్ బ్యాగుల కోసం బీసీసీఐ ప్రత్యేక వసతి
- సెప్టెంబర్ 28న ఏషియన్ గేమ్స్ క్వార్టర్ ఫైనల్

డీడీ9 వార్త :

నాగోయా వెళ్లేందుకు సిద్ధమవుతున్న భారత పురుషుల క్రికెట్ జట్టుకు చివరి నిమిషంలో కిట్ సమస్యలు ఎదురయ్యాయి. శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలోని జట్టు ఆదివారం తెల్ల వారుజామున ఢిల్లీ నుంచి జపాన్‌కు బయలుదేరనుంది. అయితే కొందరు ఆటగాళ్లకు సరైన సైజులో అధికారిక కిట్లు ఇంకా అందలేదు. దీనిపై బీసీసీఐ, భారత ఒలింపిక్ సంఘం కిట్ సరఫరాదారు జేఎస్‌డబ్ల్యూ ఇన్‌స్పైర్ మధ్య పలు మార్లు చర్చలు జరిగాయి.

చాలా మంది ఆటగాళ్ల కిట్ సైజు సమస్యలు ఇప్పటికే పరిష్కారమయ్యాయి. మిగిలిన కొందరికి కూడా త్వరలో కిట్లు అందుతాయని సమాచారం. జపాన్‌లో భారత ఆటగాళ్లు రెండు రకాల జెర్సీలు ఉపయోగించనున్నారు. సెప్టెంబర్ 22న జపాన్‌తో జరిగే స్నేహపూర్వక టీ20లో సాధారణ భారత జట్టు కిట్ ధరిస్తారు. సెప్టెంబర్ 28న ప్రారంభమయ్యే ఏషియన్ గేమ్స్ క్వార్టర్ ఫైనల్ నుంచి అధికారిక ఏషియన్ గేమ్స్ జెర్సీ ధరిస్తారు.

ఇదే కిట్ సమస్య ఇప్పటికే భారత బృందంలోని మరో ప్రముఖ అథ్లెట్‌పై ప్రభావం చూపింది. షాట్‌పుట్ ఆటగాడు తజిందర్‌పాల్ సింగ్ తూర్‌కు అధికారిక కిట్ అందకపోవడంతో ప్రారంభోత్సవ వేడుకల్లో భారత పురుషుల ఫ్లాగ్‌బేరర్‌గా పాల్గొనలేకపోయాడు. అతడి స్థానంలో కబడ్డీ ఆటగాడు పవన్ సెహ్రావత్‌ను ఎంపిక చేశారు.మరోవైపు పురుషుల క్రికెట్ జట్టు బస విషయంలోనూ బీసీసీఐ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. నిర్వాహకులు కేటాయించిన గదుల్లో క్రికెట్ కిట్ బ్యాగులు పెట్టేందుకు సరిపడా స్థలం లేకపోవడంతో బోర్డు సొంతంగా వసతి ఏర్పాటు చేసింది. మహిళల జట్టు మాత్రం ఐఓఏ ఏర్పాటు చేసిన వసతిలోనే ఉంటోంది.



పురుషుల క్రికెట్ పోటీల్లో భారత్‌కు నేరుగా క్వార్టర్ ఫైనల్ బెర్త్ లభించింది. సెప్టెంబర్ 28న గ్రూప్‌ఏ రన్నరప్‌తో భారత్ తలపడనుంది. సెప్టెంబర్ 22న జపాన్‌తో టీ20 ముగిసిన తర్వాత భారత జట్టు పూర్తి దృష్టిని ఏషియన్ గేమ్స్ పోరుపై పెట్టనుంది.

రోహిత్, కోహ్లీ నుంచి ఆశిస్తుంది అదొక్కటే.. ఆకాశ్ చోప్రా ఆసక్తికర వ్యాఖ్యలు

- ప్రపంచ కప్‌కు మరో ఏడాది మాత్రమే సమయం
- ఈ టైమ్‌లో రోహిత్, కోహ్లీ నుంచి పరుగులు మాత్రమే ఆశిస్తున్నామన్న ఆకాశ్
- వెస్టిండీస్ సిరీస్‌కు ఇద్దరూ ఎంపిక
- వెస్టిండీస్‌కు ఎంపికైన టీమ్ బాగుందన్న ఆకాశ్
- అక్షర్, జడేజా, సుందర్‌లో ఒక్కరికే అవకాశం రావొచ్చని అంచనా

డీడీ9 వార్త :

వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌కు సిద్ధమవుతున్న భారత జట్టులో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీపై మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా కీలక వ్యాఖ్యలు చేశాడు. 2027 వన్డే ప్రపంచకప్‌కు ఏడాది మాత్రమే ఉండటంతో.. ఈ ఇద్దరు సీనియర్ బ్యాటర్ల నుంచి ప్రధానంగా పరుగులను మాత్రమే ఆశిస్తున్నామని చెప్పాడు. రోహిత్, కోహ్లీ ఫామ్‌లోకి వస్తే మ్యాచ్‌లను గెలిపించగలరని పేర్కొన్నాడు.

వెస్టిండీస్‌తో మూడు వన్డేల సిరీస్‌కు రోహిత్, కోహ్లీ ఇద్దరూ 15 మంది సభ్యుల జట్టులో చోటు దక్కించుకున్నారు. శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా వ్యవహరించనుండగా.. కేఎల్ రాహుల్ వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. ఆసియా క్రీడల్లో శ్రేయస్ అయ్యర్ పాల్గొంటుండటంతో రాహుల్‌కు ఈ బాధ్యతలు అప్పగించారు.

జట్టు ఎంపికపై కూడా చోప్రా సంతృప్తి వ్యక్తం చేశాడు. అందుబాటులో ఉన్న ఆటగాళ్లతో మంచి జట్టును ఎంపిక చేశారని అన్నాడు. రిషబ్ పంత్ స్థానంలో రెండో వికెట్ కీపర్‌గా ధ్రువ్ జురెల్‌ను తీసుకోవడం కూడా తనకు నచ్చిందని చెప్పాడు.

మరోవైపు రవీంద్ర జడేజా వన్డే జట్టులోకి తిరిగి వచ్చాడు. ఆసియా క్రీడల బృందం నుంచి తప్పించి నితీశ్ కుమార్ రెడ్డిని వన్డే జట్టులోకి తీసుకోవడాన్ని చోప్రా ప్రత్యేకంగా ప్రస్తావించాడు. హార్దిక్ పాండ్య అందుబాటులో లేని పరిస్థితుల్లో బౌలింగ్‌తో పాటు బ్యాటింగ్ చేయగల ఆటగాడు అవసరమని చెప్పాడు.ఆల్‌రౌండర్ల స్థానాల్లో పోటీ కూడా ఆసక్తికరంగా ఉంటుందని చోప్రా పేర్కొన్నాడు. అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ ముగ్గురిలో అందరికీ 2027 ప్రపంచకప్ జట్టులో చోటు దక్కకపోవచ్చని అన్నాడు. ప్రతి అవకాశాన్ని ఆటగాళ్లు సద్వినియోగం చేసుకోవాల్సి ఉంటుందని చెప్పాడు.



వెస్టిండీస్‌తో తొలి వన్డే సెప్టెంబర్ 27న తిరువనంతపురంలో జరగనుంది. రెండో మ్యాచ్ సెప్టెంబర్ 30న గువాహటిలో, మూడో వన్డే అక్టోబర్ 3న చండీగఢ్‌లో జరగనుంది.

అట్టహాసంగా ఆసియా క్రీడలు ప్రారంభం.. భారత పతాకధారులుగా పవన్ సెహ్రావత్, మను భాకర్

- జపాన్‌లో నేటి నుంచి 2026 ఆసియా క్రీడలు
- భారత పతాకధారులుగా కబడ్డీ ప్లేయర్ పవన్, షూటర్ మను భాకర్
- తాజిందర్‌పాల్ స్థానంలో అనూహ్యంగా పవన్‌కు దక్కిన అవకాశం
- ఈ క్రీడల్లో 36 క్రీడాంశాల్లో 503 మంది భారత అథ్లెట్ల పోటీ
- గత రికార్డును అధిగమించడమే లక్ష్యంగా బరిలోకి భారత్

డీడీ9 వార్త :

జపాన్‌లోని ఐచినగోయాలో 20వ ఆసియా క్రీడలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పాలోమా మిజుహో స్టేడియంలో జరిగిన ఆరంభ వేడుకల్లో భారత బృందానికి పతాకధారులుగా కబడ్డీ ప్లేయర్ పవన్ సెహ్రావత్, ఒలింపిక్ పతక విజేత మను భాకర్ వ్యవహరించారు. వీరిద్దరూ త్రివర్ణ పతాకాన్ని చేతబూని భారత బృందాన్ని ముందుండి నడిపించారు.

ఈ మెగా ఈవెంట్‌లో భారత్ తరపున 36 క్రీడల్లో 503 మంది అథ్లెట్లు పోటీ పడుతున్నారు. వాస్తవానికి పురుషుల విభాగంలో ఫ్లాగ్ బేరర్‌గా షాట్‌పుటర్ తాజిందర్‌పాల్ సింగ్ తూర్‌ను ఎంపిక చేశారు. అయితే, అతడికి సంబంధించిన సెరిమోనియల్ కిట్ సకాలంలో అందకపోవడంతో వేడుకకు హాజరు కాలేకపోయాడు.

దీంతో అతడి స్థానంలో పవన్ సెహ్రావత్‌కు ఈ గౌరవం దక్కింది. గత ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలిచిన భారత కబడ్డీ జట్టులో పవన్ సభ్యుడిగా ఉన్నాడు. మహిళల విభాగంలో పతాకధారిగా వ్యవహరించిన మను భాకర్, పారిస్ 2024 ఒలింపిక్స్‌లో రెండు కాంస్య పతకాలు సాధించింది.

స్వతంత్ర భారత చరిత్రలో ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు గెలిచిన తొలి అథ్లెట్‌గా ఆమె రికార్డు సృష్టించింది. ఈ క్రీడల్లో ఆమె 10 మీటర్ల ఎయిర్ పిస్టల్, 25 మీటర్ల పిస్టల్, మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్లలో పోటీపడనుంది.

గతంలో హాంగ్‌జౌ 2022 ఆసియా క్రీడల్లో 107 పతకాలతో రికార్డు సృష్టించిన భారత్, ఈసారి ఆ ప్రదర్శనను అధిగమించి మరిన్ని పతకాలు సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది.



రష్యాలో మళ్లీ క్రికెట్ సందడి.. ప్రారంభమైన టీ10 లీగ్.. టార్గెట్ ఒలింపిక్స్!

- రష్యాలో క్రికెట్‌కు కొత్త ఊపు
- నాలుగు జట్లతో రష్యన్ టీ10 లీగ్ ప్రారంభం
- స్థానిక ఆటగాళ్లతో పాటు ప్రవాసులకు అవకాశం
- ఒలింపిక్స్ లక్ష్యంగా క్రికెట్ అభివృద్ధికి ప్రణాళిక
- రెండు రోజుల పాటు ఏడు మ్యాచ్‌ల టోర్నమెంట్

డీడీ9 వార్త :

ఫుట్‌బాల్, ఐస్ హాకీ, చెస్ వంటి క్రీడలకు ప్రసిద్ధి చెందిన రష్యాలో ఇప్పుడు క్రికెట్ సందడి మొదలైంది. దేశంలో క్రికెట్‌ను పునరుజ్జీవింపజేయాలనే లక్ష్యంతో రష్యన్ క్రికెట్ ఫెడరేషన్ (క్రికెట్ రష్యా) సరికొత్త టోర్నమెంట్‌కు శ్రీకారం చుట్టింది. 'రష్యన్ టీ10 లీగ్' పేరుతో నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్ శని, ఆదివారాల్లో (సెప్టెంబర్ 19, 20) జరగనుంది. చారిత్రాత్మక లుజ్నికి స్టేడియం ఈ మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇస్తోంది.

ఈ రెండు రోజుల ఈవెంట్‌లో మొత్తం నాలుగు జట్లు పోటీ పడుతున్నాయి. మాస్కో ఫాక్సెస్, క్రెమ్లిన్ స్టార్స్, కజాన్ ఫాల్కన్స్, సెయింట్ పీటర్స్‌బర్గ్ లయన్స్ టైటిల్ కోసం తలపడనున్నాయి. మొత్తం ఏడు మ్యాచ్‌లు జరగనుండగా, మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్ల మధ్య ఫైనల్ జరుగుతుంది.

కేవలం టోర్నీ కాదు.. సుదీర్ఘ ప్రణాళిక

ఈ లీగ్ ప్రారంభంపై రష్యన్ క్రికెట్ ఫెడరేషన్ డైరెక్టర్ సంభవ్ జైన్ మాట్లాడుతూ, "ఈ టోర్నమెంట్ కేవలం ఒక క్రీడా పోటీ మాత్రమే కాదు. రష్యా వ్యాప్తంగా క్రికెట్‌ను ప్రోత్సహించడం, కొత్త ఆటగాళ్లను, ప్రేక్షకులను ఆకర్షించడం, క్రీడాభివృద్ధికి మరిన్ని అవకాశాలు సృష్టించడం అనే విస్తృత దృష్టిలో ఇది ఒక భాగం" అని వివరించారు. ఈ టోర్నీలో నాలుగు జట్ల తరపున మొత్తం 60 మంది ఆటగాళ్లు పాల్గొంటున్నారని, వారి ప్రతిభను ప్రదర్శించడానికి, అనుభవం గడించడానికి ఇది ఒక చక్కని వేదిక అని ఆయన అన్నారు.

ఈ టీ10 లీగ్ ద్వారా రష్యాలో తొలిసారిగా ఒక నిర్మాణాత్మక దేశీయ క్రికెట్ క్యాలెండర్ రూపుదిద్దుకుంది. స్థానిక రష్యన్ ఆటగాళ్లు, వివిధ దేశాలకు చెందిన ప్రవాసులు, దక్షిణాసియా దేశస్థులు కలిసి ఈ లీగ్‌లో పాల్గొనడం విశేషం. కొత్త ప్రేక్షకులను సైతం తక్షణమే ఆకట్టుకునేలా వేగవంతమైన టీ10 ఫార్మాట్‌ను ఎంచుకున్నారు. దేశీయంగా ప్రతిభావంతులైన రష్యన్ ఆటగాళ్లను గుర్తించి, జాతీయ జట్టు కోసం వారిని తీర్చిదిద్దడం ఈ టోర్నమెంట్ ముఖ్య ఉద్దేశం.

ఒలింపిక్స్ లక్ష్యంగా అడుగులు

రష్యాలో క్రికెట్‌ను ప్రధాన స్రవంతి క్రీడగా మార్చాలనే 'రష్యా క్రికెట్ డెవలప్‌మెంట్ ఇనిషియేటివ్'లో ఈ టీ10 లీగ్ మొదటి అడుగు. భవిష్యత్తులో దేశంలో బలమైన దేశీయ లీగ్‌ను ఏర్పాటు చేయడం, ప్రతి ప్రధాన నగరంలో ప్రపంచ స్థాయి క్రికెట్ మౌలిక సదుపాయాలను నిర్మించడం, అంతర్జాతీయ వేదికపై పోటీపడేలా రష్యా జాతీయ జట్టును సిద్ధం చేయడం వంటివి వీరి దీర్ఘకాలిక లక్ష్యాలు.

"2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో క్రికెట్ తిరిగి ప్రవేశిస్తున్న తరుణంలో, ఈ లీగ్ ప్రారంభించడం సరైన ముందడుగు. ఇతర అసోసియేట్ దేశాలు తమ దేశీయ క్రికెట్ నిర్మాణాలను వృత్తిపరంగా మార్చుకుంటున్నాయి. ఈ సమయంలో నగరాల ఆధారిత ఫ్రాంచైజీ పోటీ రష్యా క్రికెట్ అభివృద్ధికి స్పష్టమైన మార్గాన్ని అందిస్తుంది" అని సంభవ్ జైన్ తెలిపారు.

రష్యన్ టీ10 లీగ్ షెడ్యూల్:

2026 సెప్టెంబర్ 19:

మ్యాచ్ 1: క్రెమ్లిన్ స్టార్స్ vs కజాన్ ఫాల్కన్స్

మ్యాచ్ 2: మాస్కో ఫాక్సెస్ vs సెయింట్ పీటర్స్‌బర్గ్ లయన్స్

మ్యాచ్ 3: క్రెమ్లిన్ స్టార్స్ vs మాస్కో ఫాక్సెస్

2026 సెప్టెంబర్ 20:

మ్యాచ్ 1: కజాన్ ఫాల్కన్స్ vs సెయింట్ పీటర్స్‌బర్గ్ లయన్స్

మ్యాచ్ 2: క్రెమ్లిన్ స్టార్స్ vs సెయింట్ పీటర్స్‌బర్గ్ లయన్స్

మ్యాచ్ 3: కజాన్ ఫాల్కన్స్ vs మాస్కో ఫాక్సెస్

ఫైనల్: మొదటి స్థానం vs రెండో స్థానం

రష్యాలో క్రికెట్ ఇప్పటిది కాదు.. 150 ఏళ్ల చరిత్ర ఉందని మీకు తెలుసా?

రష్యాలో క్రికెట్ ఆడతారా? అంటే చాలామంది ఆశ్చర్యపోతారు. కానీ, ఆ దేశానికి క్రికెట్‌తో సుదీర్ఘమైన సంబంధం ఉంది. దాని చరిత్ర 19వ శతాబ్దంలోనే ప్రారంభమైంది. 1870వ దశకంలో రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో నివసించిన బ్రిటిష్ దౌత్యవేత్తలు, వ్యాపారులు ఈ ఆటను మొదలుపెట్టారు. 1895 నాటికి అక్కడ నాలుగు క్రికెట్ క్లబ్‌లు కూడా ఏర్పడ్డాయి. అయితే, 1917లో వచ్చిన కమ్యూనిస్ట్ విప్లవం తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది.

క్రికెట్‌ను పెట్టుబడిదారీ వర్గాల ఆటగా ('బూర్జువా' గేమ్‌గా) భావించిన సోవియట్ పాలకులు దాన్ని ప్రోత్సహించలేదు. దీంతో బ్రిటిష్ వారు దేశం విడిచి వెళ్లడంతో అక్కడ క్రికెట్ దాదాపు కనుమరుగైపోయింది. చాలా కాలం తర్వాత, 1995లో భారత్, పాకిస్థాన్, యూకే, ఆస్ట్రేలియా వంటి దేశాల నుంచి వచ్చిన వలసదారులు మళ్లీ ఫ్రెండ్లీ మ్యాచ్‌లు ఆడటం మొదలుపెట్టారు. ఈ క్రమంలో 2004లో 'క్రికెట్ రష్యా' పేరుతో అధికారిక బోర్డు ఏర్పాటై, 2012లో దీనికి అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) అనుబంధ సభ్యత్వం కూడా లభించింది. కానీ, కొన్ని నిబంధనల ఉల్లంఘనల కారణంగా 2022లో ఐసీసీ ఆ సభ్యత్వాన్ని రద్దు చేసింది.

ప్రస్తుతం, స్థానిక ఆటగాళ్లతో పాటు, ముఖ్యంగా వైద్య విద్య కోసం రష్యా వెళ్లిన భారతీయ విద్యార్థులు దేశీయ టోర్నమెంట్లు, క్లబ్ మ్యాచ్‌లలో చురుగ్గా పాల్గొంటూ అక్కడ క్రికెట్‌ను సజీవంగా ఉంచుతున్నారు.

భారీ ధరకు అమ్ముడుపోయిన 'దాదా' శాటిలైట్ రైట్స్?

నందమూరి నటసింహం బాలకృష్ణ, మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో వస్తున్న క్రేజీ యాక్షన్ డ్రామా 'దాదా'. బాక్సాఫీస్ వద్ద ఘనవిజయం సాధించిన 'వీరసింహారెడ్డి' వంటి చిత్రం తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో విపరీతమైన అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రంలో నందమూరి బాలకృష్ణ సరసన అందాల భామ కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తుండగా, టాలెంటెడ్ నటుడు మంచు మనోజ్ సరికొత్త పవర్‌ఫుల్ విలన్ పాత్రలో కనిపించబోతున్నారు. ఈ సినిమాకు టాలీవుడ్ టాప్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్.ఎస్. తమన్ సంగీతం అందిస్తున్నారు. వృద్ధి సినిమాస్ పతాకంపై నిర్మాత సతీష్ కిలారు ఏమాత్రం రాజీ పడకుండా అత్యున్నత నిర్మాణ విలువలతో ఈ భారీ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇక షూటింగ్ దశలోనే ఉన్న ఈ సినిమాకు సంబంధించిన బిజినెస్ పరంగా అదిరిపోయే రికార్డులు నమోదవుతున్నాయి. గత కొద్ది రోజులుగా ఈ ప్రాజెక్ట్ గురించిన ప్రతి అప్‌డేట్ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలుస్తూ, చర్చనీయాంశంగా మారుతోంది.

తాజాగా, ఈ చిత్రానికి సంబంధించి ఓ భారీ డీల్ క్లోజ్ అయినట్లు తెలుస్తోంది. ప్రముఖ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ 'జీ5' (ZEE5) 'దాదా' చిత్రానికి సంబంధించిన డిజిటల్ రైట్స్, శాటిలైట్ హక్కులతో పాటు ఆడియో హక్కులను కూడా కలుపుకుని ఏకంగా రూ. 70 కోట్ల భారీ ధరకు సొంతం చేసుకుందని టాక్. సినిమా థియేటర్లలో విడుదలకు ముందే నాన్‌థియేట్రికల్ మార్కెట్‌లో ఈ స్థాయిలో బిజినెస్ జరగడం బాలకృష్ణ సినిమా స్టామినాను మరోసారి స్పష్టం చేస్తోంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్టులు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. ఇక అన్ని హంగులు పూర్తి చేసుకుని ఈ చిత్రం క్రిస్మస్ కానుకగా రిలీజ్ చేయనున్నట్లు తెలుస్తోంది. డిసెంబర్ 24, 2026న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.





మగవాళ్లు ఏడవకూడదా?

'ఏషన్ నాగుల కట్ట మీద ఏసిన ఉయ్యాల..' అంటూ ఇటీవలే తన స్టెప్పులతో కుర్రకారుని అలరించింది అందాల తార కీర్తి సురేశ్. ఆమె ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'డోరతి'. కార్తిక్ సుబ్బరాజ్ దర్శకత్వం వహించారు. సనంత్, రిషికాంత్ కీలక పాత్రలు పోషించారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా ''అన్నింటినీ మార్చేసే 'డోరతి'' అనే వ్యాఖ్యతో పంచుకుంది కీర్తి. ''ఆడవాళ్లు మాత్రమే ఏడవాలని ఎవరు చెప్పారు? మగవాళ్లు ఏడవకూడదా?'' అంటూ సాగుతోన్న ఈ ట్రైలర్ సినీప్రియుల దృష్టిని ఆకర్షిస్తోంది. 90ల కాలంలోని చిన్ననాటి ఇద్దరు స్నేహితులు, వారికి పరిచయమైన ఓ మహిళ చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుందని ట్రైలర్‌తో స్పష్టం చేసింది చిత్రబృందం. గునీత్ మోంగా కపూర్, అచిన్ జైన్, జ్యోతి దేశ్‌పాండే సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న థియేటర్లలోకి రానుంది.


విజయ్ ఫోన్‌తో ఆశ్చర్యపోయా..

బిగ్‌బాస్‌లో వ్యాఖ్యాత విజయ్ సేతుపతి ఇటీవల చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చకు దారితీసిన విషయం తెలిసిందే. ఆయన తమిళనాడు సీఎం విజయ్‌ను ఉద్దేశించి మాట్లాడారంటూ విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న విజయ్ సేతుపతి.. విజయ్‌తో (Vijay) తనకున్న అనుబంధాన్ని పంచుకున్నారు.

"జానన్ సంజయ్ పుట్టినరోజు సందర్భంగా నేను ఒకసారి విషెస్ చెప్పాను. అది చూసి విజయ్ నాకు ఫోన్ చేశారు. డియర్ ఫ్రెండ్ అంటూ నాతో మాట్లాడారు. నా విషెస్ చూసి వాళ్ల అబ్బాయి చాలా సంతోషించాడని తెలిపారు. ఆయన నుంచి ఫోన్ రావడంతో నేను ఆశ్చర్యపోయా. అంతపెద్ద స్టార్ అయినప్పటికీ చాలా సింపుల్‌గా ఉంటారు. 'జన నాయగన్' సెట్స్‌కు వెళ్లి ఆయనను చూసినప్పుడు చాలా క్యూట్‌గా ఉన్నారనిపించింది" అని విజయ్ సేతుపతి (Vijay Sethupathi) చెప్పారు.



మీనాక్షి పిటిషన్‌పై దిల్లీ హైకోర్టు ఉత్తర్వులు



కథానాయిక మీనాక్షి చౌదరికి సంబంధించిన అశ్లీల, అసభ్యకరమైన కంటెంట్‌ను తొలగించాలని ఆదేశిస్తూ దిల్లీ హైకోర్టు ఏకపక్ష తాత్కాలిక మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. ఇటీవలే మీనాక్షి తన వ్యక్తిత్వ హక్కుల పరిరక్షణ, తన చిత్రాలను ఏ విధంగానూ ఉపయోగించకూడదని కోరుతూ పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే శుక్రవారం దీన్ని విచారించిన ధర్మాసనం.. అశ్లీల కంటెంట్‌ను తొలగించాలని ఆదేశించినా.. ఏకపక్ష దశలో తన ఫొటోలకు సంబంధించి పూర్తిస్థాయి నిషేధాజ్ఞ ఉత్తర్వులను జారీ చేయలేమని స్పష్టం చేసింది. మీనాక్షి పేరును వాణిజ్య ప్రయోజనాలు, డబ్బు సంపాదించడం కోసం ఎలా వాడుకుంటున్నారో చూపించమని ఆమె తరఫు న్యాయవాదిని ప్రశ్నించింది. ''వ్యక్తిత్వ హక్కులకు సంబంధించిన వ్యవహారాల్లో 'బ్లాంకెట్ ఇంజంక్షన్' (అన్నింటికీ వర్తించేలా పూర్తిస్థాయి నిషేధాజ్ఞలు) జారీ చేయలేం. చాలా స్పష్టంగా చెబుతున్నాం. ఎవరైనా మీ చిత్రాలు, ఇతర అంశాలను ఉపయోగించి డబ్బు సంపాదిస్తున్నారనే విషయాన్ని కచ్చితంగా నిరూపించాల్సి ఉంటుంద''ని ధర్మాసనం పేర్కొంది. తదుపరి విచారణను ఈ నెల 22కు

నేషనల్ క్రష్ రష్మిక మందన్న తెలుగు యాసపై సోషల్ మీడియాలో కొందరు ట్రోలింగ్ చేస్తున్నారు.

ఇటీవల ఓ ఈవెంట్‌లో భాగంగా మాట్లాడిన వీడియోపై విమర్శలు వస్తున్నాయి. తాజాగా, ఈ విషయంపై రష్మిక స్పందించారు. ఏ ఒక్క భాషలోనూ తాను పరిపూర్ణంగా నిపుణురాలిని కాకపోవచ్చని, విభిన్న భాషలకు, పాత్రలకు తగినట్లుగా మారడమే తన ప్రయాణంలో భాగమని తెలిపారు. తాను కొడవ వర్గానికి చెందినదాన్ని అని, మాతృభాష అయిన కొడవ తక్ మాట్లాడతానని రష్మిక గుర్తుచేసుకున్నారు. తన మాతృభాషకుంటూ ప్రత్యేకంగా ఒక సినిమా ఇండస్ట్రీ లేకపోవడం వల్ల, కెరీర్‌లో భాష ఎప్పుడూ పెద్ద అడ్డంకి కాలేదని చెప్పారు. తాను ఏ భాషలో నటించినా ఆ భాషను తన సొంత భాషలాగే భావిస్తానని తెలిపారు. తన కుటుంబాన్ని ఎంతగానో ప్రేమించే అభిమానులే మొదట తనను తెలుగు సినిమాలు చేయమని ప్రోత్సహించారని, అలాగే హిందీ ప్రాజెక్ట్‌ల విషయంలోనూ అదే జరిగిందని, అలా తన సినీ ప్రయాణం అన్ని ఇండస్ట్రీలకు పాకిందని ఆమె వెల్లడించారు. తన యాసపై వచ్చే కామెంట్ల గురించి మాట్లాడుతూ.. తన మాట్లాడే తీరుపై రకరకాల అభిప్రాయాలు రావడం తనకు కొత్తేమీ కాదని, వాటిని స్వీకరించడానికి అలవాటు పడ్డానని రష్మిక చెప్పారు. ఒక నిర్దిష్ట భాషలో అడిగే ప్రశ్నలకు సమాధానం ఇవ్వగలగడమే ముఖ్యం అని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులను గౌరవించే విధానం అదేనని అన్నారు. తాను అన్ని పనులు చేయగలిగినప్పటికీ, ఏ ఒక్క దాంట్లోనూ తాను పూర్తి మాస్టర్ అనిపించుకోకపోవచ్చునని తెలిపారు. సినిమాల్లో తన యాసపై జరిగే పనికిరాని చర్చలను తాను పట్టించుకోనని, కేవలం తన పాత్రకు పూర్తి న్యాయం చేయడంపైనే దృష్టి పెడతానని స్పష్టం చేశారు. నటిగా అద్భుతమైన కథలను ప్రేక్షకులకు అందించడమే తన పని అని రష్మిక చెప్పుకొచ్చారు.

పనికిరాని చర్చలను పట్టించుకోను పనిపై దృష్టి పెడతా..



మళ్లీ ప్రేమలో పడే సమయం ఆసన్నమైంది..



విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జోడీ మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. వీరిద్దరి క్రేజీ కాంబినేషన్‌లో వస్తున్న పీరియాడిక్ డ్రామా 'రణబాలి'. 'గీతా గోవిందం', 'డియర్ కామ్రేడ్' సినిమాల తర్వాత వీరిద్దరు కలిసి నటిస్తున్న మూడో ప్రాజెక్ట్ ఇది కావడం విశేషం. ప్రముఖ నిర్మాణ సంస్థలు మైత్రీ మూవీ మేకర్స్, టీసిరీస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి టాలెంటెడ్ డైరెక్టర్ రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. 1854 నుంచి 1878 మధ్య కాలంలో బ్రిటిష్ పాలనలోని దక్షిణ భారతం, ప్రధానంగా రాయలసీమ నేపథ్యంలో ఈ పీరియడ్ యాక్షన్ డ్రామా తెరకెక్కుతోంది. గొప్ప మద్రాస్ కరువు, వలస పాలన, స్థానిక ప్రతిఘటనల ఆధారంగా ఈ ఫిక్షనల్ కథను రూపొందించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా అక్టోబర్ 16న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ప్రమోషన్స్ జోరు పెంచారు. మ్యూజికల్ జర్నీని ప్రారంభిస్తున్నట్లు తెలుపుతూ.. తాజాగా ఫస్ట్ సింగిల్ అప్డేట్‌ను ప్రకటించారు. ''మీరు గ్లింప్స్ చూశారు.. దానిని మన స్ఫూర్తిగా స్వీకరించారు.

ఇప్పుడు దానితో మళ్లీ ప్రేమలో పడే సమయం ఆసన్నమైంది'' అనే ఆసక్తికరమైన క్యాప్షన్‌ను జత చేస్తూ 'రణబాలి' చిత్రం నుంచి తొలి పాటను విడుదల చేయబోతున్నట్లు వెల్లడించారు. 'ఏందయ్యా సామి ఇట్ట గాస్తాంది వెన్నెల' అంటూ సాగే ఈ పాటను తెలుగు, తమిళ, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో సెప్టెంబర్ 21న విడుదల చేస్తున్నారు.ఈ పాటకు స్టార్ మ్యూజిక్ డైరెక్టర్లు అజయ్-అతుల్ సంగీతం అందించగా, ప్రముఖ గీత రచయిత రామజోగయ్య శాస్త్రి అద్భుతమైన సాహిత్యాన్ని అందించారు. అలాగే అజయ్ గోగావలే, శ్వేతా మోహన్ కలిసి ఈ పాటను ఎంతో మధురంగా ఆలపించారు. భారీ అంచనాల మధ్య వస్తున్న ఈ సినిమాలోని తొలి పాట కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

గతంలో తాను చేసిన బోల్డ్ పాత్రల వల్ల, కథలో అవసరం లేకపోయినా తనతో ముద్దు సీన్లు చేయించాలని కొందరు దర్శకనిర్మాతలు యత్నించారని బాలీవుడ్ నటి రాధికా ఆప్టే (Radhika Apte) అన్నారు. తనను కేవలం లోదుస్తులతో ఓ యాక్షన్ సన్నివేశంలో నటించాలని అడిగారని ఆమె గుర్తుచేసుకున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన రాధికా.. సన్నివేశాల ఎంపికపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

"కెరీర్ ప్రారంభంలో కొన్ని సినిమాల్లో నగ్నంగా నటించాను. అది చూసి 'ఆమె సులభంగా అంగీకరిస్తుందిలే' అని కొందరు అనుకుంటున్నారు. కానీ, ఇప్పుడు నేను అలాంటివి చేయడంలేదు. మూవీలో సన్నిహిత సన్నివేశాలు ఎందుకు అవసరమో స్పష్టమైన కారణం చెప్పాలని అడుగుతున్నాను. కొందరైతే 'ఓ 15 సెకన్లు పదో అలా ముద్దు సీన్ కవర్ చేసేయండి' అని అడుగుతున్నారు. అది వింటే నాకు నవ్వొస్తుంది" అని రాధికా పేర్కొన్నారు."ఒక సినిమా సెట్‌లో యాక్షన్ సన్నివేశం కోసం షర్టు గుండీలు విప్పేసి నటించగలరా? అని అడిగారు. యాక్షన్ సీన్ అంటే వేగంగా కదులుతాం కాబట్టి కుదరదని చెప్పా. పోనీ కేవలం లోదుస్తులతో అయినా చేయాలని అడిగారు. అసలు దీని ద్వారా ఏం సాధించాలనుకుంటున్నారు? అని నేను వారిని ప్రశ్నించా. ఆ సీన్ చేయడానికి అంగీకరించలేదు. నన్ను అలా అడిగిన వ్యక్తి పేరు చెబితే మీరంతా కచ్చితంగా ఆశ్చర్యపోతారు. ఆ స్థాయి ఉన్న వ్యక్తుల నుంచి అలాంటి మాటలు ఎవరూ ఊహించరు" అని రాధిక చెప్పుకొచ్చారు. కేవలం ప్రాజెక్ట్‌ను హిట్ చేయడానికి నటీమణులను హద్దులు దాటేలా ఒత్తిడి తేవడం సరికాదని ఆమె అన్నారు.రాధికా ఆప్టే ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతున్న 'లస్ట్ స్టోరీస్ 3' (Lust Stories 3) వెబ్ సిరీస్‌లో నటించారు. ఆమెతో పాటు ప్రముఖ నటులు సిద్ధార్థ్, అదితీరావ్ హైదరీ, కొంకణా సేన్ శర్మ, రాధికా మదన్, విజయ్ వర్మ, అభిషేక్ బెనర్జీ, అలీ ఫజల్ తదితరులు ఇందులో కీలక పాత్రలు పోషించారు.

ఏదో అలా ముద్దు సీన్ కవర్ చేసేయండి అని అడుగుతున్నారు

This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500204. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.